Email:prajamantalu@gmail.com www.prajamantalu.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 94

పేజీలు - 8 వెల- రూ 5:00

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

గురువారం 21, సెప్టెంబర్-2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## మళ్లీ భారీ వర్షాలు కురిసే అవకాశం



3లో..

# మహిళా బిల్లుకు లోక్‌సభ ఆమోదం



- సుదీర్ఘ చర్చ అనంతరం మెజార్టీ సభ్యుల మద్దతు
- అనుకూలంగా 454 మంది ఎంపిల ఓటు
- బిల్లును వ్యతిరేకించిన ఇద్దరు ఎంఐఎం సభ్యులు
- నేడు రాజ్యసభ ముందుకు బిల్లు
- రాజ్యసభ ఆమోదం తరవాత రాష్ట్రపతి ముందుకు

న్యూఢిల్లీ,సెప్టెంబర్20 : కొత్త పార్లమెంట్‌లో చరిత్రాత్మక బిల్లుకు ఆమోదం లభించింది. సంపూర్ణ మెజార్టీతో మహిళా రిజర్వేషన్ బిల్లు 'నారీ శక్తి వందన్ అధినియమ్'కు లోక్‌సభ ఆమోద ముద్ర వేసింది. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో భాగంగా.. మూడవ రోజు బుధవారం ఎనిమిది గంటలపాటు మహిళా రిజర్వేషన్ బిల్లుపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఆపై ఓటింగ్ ద్వారా బిల్లు ఆమోదం పొందగా.. కొత్త పార్లమెంట్‌లో పాసైన తొలి బిల్లుగా రికార్డు సృష్టించింది. ఓటింగ్ సమయంలో సభలో 456 మంది సభ్యులు ఉండగా.. బిల్లుకు అనుకూలంగా 454 ఓట్లు.. వ్యతిరేకంగా రెండు ఓట్లు పడ్డాయి. ఇద్దరు మజ్లిస్ ఎంపీలు మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించారు. ఎంఐఎం చీఫ్.. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, మరో ఎంఐఎం ఔరంగాబాద్ ఎంపీ ఇంతియాజ్ జలీల్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేశారు. కాగా లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం లభించడం ఇదే తొలిసారి. అయితే విపక్షాల సూచనలేవీ బిల్లులో ఆమోదించలేదు. గతంలో యూపీఏ హయాంలో రాజ్యసభలో (108వ రాజ్యాంగ సవరణ) బిల్లు పాస్ అయినప్పటికీ లోక్‌సభలో ఆమోదం పొందలేదు. ఇక ఇప్పుడు లోక్‌సభ ఆమోదంతో రిజర్వేషన్ బిల్లు రాజ్యసభ ముందుకు వెళ్లనుంది. అక్కడ కూడా బిల్లుకు ఆమోదం పొందే అవకాశం ఉంది. ఇక డీలిమిటేషన్ తర్వాత 2029 ఎన్నికల సమయంలో మహిళా రిజర్వేషన్ కోటా అమలుకానుంది. మిగతా 2లో..

## బిల్లును పూర్తిగా స్వాగతిస్తున్నా

- భారతీయ పౌరుడిగా గర్విస్తున్నా
- మహిళా రిజర్వేషన్లకై నా సీటు సైతం వదులుకుంటా
- మహిళలు రాజకీయాల్లోకి రావాలి
- ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్
- మాదాపూర్‌లో ఇంటర్నేషనల్ టెక్‌పార్క్ ప్రారంభం



హైదరాబాద్,సెప్టెంబర్20 : మహిళా రిజర్వేషన్లలో తన సీటు పోతే వదులుకునేందుకు తాను సిద్ధంగా ఉన్న మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని ఇంటర్నేషనల్ టెక్‌పార్క్‌ను ప్రారంభించిన మంత్రి.. మహిళా బిల్లుపై స్పందించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ను పూర్తిగా స్వాగతిస్తున్నట్లు కేటీఆర్ చెప్పారు. మహిళా నేతలు చాలామంది రావాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. మన జీవితాలు చాలా చిన్నవని.. అందులో తన పాత్ర తాను పోషించినట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్ల అమలులో తన సీటు పోయినా.. వదులుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. అంతకు ముందు టెక్‌పార్క్‌ను ప్రారంభించిన తర్వాత విదేశీ ప్రతినిధులు మంత్రి కేటీఆర్‌ను సత్కరించారు. జకీయాలకు అతీతంగా ప్రజల కోసం ఎన్నో సమస్యలను మేము లేవనెత్తామని మంత్రి కేటీఆర్ అన్నారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన సమస్యలపై అందరు కలిసి నిలబడాలని ఆయన ఎక్స్ వేదికగా కోరారు. మంగళవారం పార్లమెంట్ మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టినందుకు భారతీయ పౌరుడిగా గర్విస్తున్నానని ఆయన తెలియజేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతిచ్చిన అన్ని రాజకీయ పార్టీల వారందరికీ కేటీఆర్ అభినందనలు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును కోసం సీఎం కేసీఆర్ నిర్దేశించిన బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం కూడా దీనిని సాకారం చేసేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసినందుకు సంతోషం, గర్వంగా ఉందని ఆయన తెలిపారు. తెలంగాణలో స్థానిక ప్రభుత్వాలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేశామని ఆయన గుర్తించారు. జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు, గ్రామ పంచాయతీల్లో అమలు చేశామని పేర్కొన్నారు.

### సీఎం కేసీఆర్ చేసేదే చెప్తాడు.. చెప్పింది చేస్తాడు

వివరాలు 2లో..

### నవదీప్ విచారణకు హైకోర్టు ఆదేశం

వివరాలు 2లో..

### మహిళా బిల్లుకు పూర్తి మద్దతు చర్చలో రాహుల్ వెల్లడి



న్యూఢిల్లీ,సెప్టెంబర్20 : మహిళా రిజర్వేషన్ బిల్లుకు తమ మద్దతు ఉంటుందని, అయితే, బిల్లులో ఓబీసీ కోటా అమలు చేయాలని తాము కోరుకుంటున్నామని కాంగ్రెస్ వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లుపై చర్చలో ఆయన పాల్గొంటూ మోదీ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. భారత ప్రభుత్వంలోని సెక్రటరీల నియామకాల్లో ఓబీసీలను మోదీ సర్కార్ నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. జీఓఐలో 90 మంది సెక్రటరీలు ఉండగా, అందులో ఓబీసీలు ముగ్గురేనని, ఓబీసీ సెక్రటరీలు లేకపోవడం ఆ సామాజికవర్గాన్ని అమానించడమేనని, మిగతా 2లో..

## మహిళా రిజర్వేషన్ బిల్లు ఆలస్యం చేయొద్దు

- బిల్లును వెంటనే అమలు చేయండి
- జాప్యం జరిగితే భారత మహిళలకు తీరని అన్యాయం
- బిల్లుకు కాంగ్రెస్? పూర్తి మద్దతు ఇస్తుంది
- చట్టం సమర్థ అమలుకు తక్షణమే కులగణన చేపట్టాలి
- కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ



న్యూఢిల్లీ,సెప్టెంబర్20 : మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులో జాప్యం జరిగితే.. అది భారత మహిళలకు తీరని అన్యాయం చేసినట్లేనని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ అన్నారు. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై విపక్షాల తరపున మిగతా 2లో..

### సెక్యులర్, సోషలిస్ట్ పదాలు ఎక్కడ??

- రాజ్యాంగం నుంచి పదాలు మిస్సింగ్..
- కాంగ్రెస్ లోక్‌సభాపక్షనేత అధీర్ రంజన్ చౌదరి విమర్శలు
- మహిళా బిల్లుపైనా పార్లమెంట్‌లో వాడివేడి చర్చ


2లో..

### భారీగా పతనమైన స్టాక్ మార్కెట్లు

20,000 పాయింట్ల దిగువకు నిఫ్టీ

వివరాలు 3లో..

### ప్రజానాడి



### నల్గొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**అదుపు తప్పి బైకును ఢీకొట్టిన కారు**

**ఐదుగురు దుర్మరణం, మరో ఇద్దరికి గాయాలు**





నల్గొండ,సెప్టెంబర్20( : నల్గొండ జిల్లాలో బుధవారం ఘోర రోడ్డు ప్రమా దం జరిగింది. దేవరకొండ నియోజకవర్గం చింతపల్లి మండలం నర్సర్లపల్లి వద్ద బుధవారం సాయంత్రం కారు అదుపు తప్పి బైకును ఢీకొట్టింది. ఆ తర్వాత కారు సైతం రోడ్డుపై పల్టీలు కొట్టి రోడ్డు పక్కన పడిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు దుర్మరణం చెందారు. బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురితో పాటు కారులో ఉన్న మరో ఇద్దరు సైతం ప్రాణాలు కోల్పోయారు. వివరాల్లోకి వెళితే.. మద్దిగూడ ప్రసాద్ హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తన భార్య రమణమ్మ, కొడుకు అవినాష్‌తో కలిసి బైక్‌పై స్వగ్రామం వెళ్తున్నాడు. ఈ క్రమంలో చింతపల్లి వద్ద కారు ఢీకొట్టింది. అనంతరం కారు సైతం బోల్తాపడింది. ప్రమాదంలో తండ్రీ కొడుకులు ఇద్దరు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. మిగతా 2లో..

### అప్జల్ గంజ్ లో భారీ అగ్ని ప్రమాదం



**రహదారి పక్కనే ఉన్న గుడిసెలు అగ్నికి ఆహుతి**

హైదరాబాద్,సెప్టెంబర్20 : అప్జల్ గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది.. ఈ అగ్ని ప్రమాదంలో పుత్లి బౌలి ప్రధాన రహదారి పక్కనే ఉన్న గుడిసెలు అగ్నికి ఆహుతి అయ్యాయి భారీగా ఎగిసి పడ్డ మంటల దాటికి గుడిసెలన్నీ క్షణాల్లో కాలి బూడిదయ్యాయి.. మిగతా 2లో..

### రంగారెడ్డి జిల్లాలో పరువు హత్య



3లో..

# పేదల సొంతింటి కల సాకారం

## కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి



హైదరాబాద్,సెప్టెంబర్20 : బీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకంతో నిరుపేదలకు సొంతింటి కల సాకారం అవుతుందని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ గృహలక్ష్మి పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు మంత్రి మంజూరు పత్రా లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహలక్ష్మి పథకంఇళ్లు లేని నిరుపేదలకు వరంగా మారిందని, ముఖ్య మంత్రి కేసీఆర్ నిరుపేదలకు మంచి చేయాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని రూపొందించినట్లు చెప్పారు. ఖాళీ స్థలం ఉండి ఇళ్లు లేని అర్హులైన నిరుపేదలందరికి గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షలను అందించేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని, ఈ విషయంలో ఎవరు ఆందోళన చేందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం మొదటి విడతలో 8 వందల మంది లబ్ధిదారులకు గృహలక్ష్మి ఉత్వర్వులను అందించామని, త్వరలోనే మరో విడతతో మరింత మంది లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.గృహలక్ష్మి పథకం లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు చేపట్టాలని మంత్రి మల్లారెడ్డి కోరారు. పనులు ప్రారంభమైతే లబ్ధిదారుల ఖాతాలలో ప్రభుత్వం డబ్బులను జమ చేస్తుందని పేర్కొన్నారు. ఖాళీ స్థలం, ప్లాట్ ఉన్న ప్రతి ఒక్కరూ గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు చేసుకోవచ్చని చెప్పారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్లు, సర్పంచులు, కౌన్సిలర్లు ప్రజలకు సహకరించి వారికి సంబంధించిన దరఖాస్తులను అధికారులకు అందజేయాలని మంత్రి మల్లారెడ్డి పేర్కొన్నారు.

# పథకాలు దేశానికే ఆదర్శం

## సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్



జగిత్యాల,సెప్టెంబర్20 : కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు దేశానికే ఆదర్శం అని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం పెగడపల్లి మండలం ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం అనేది ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనలో పుట్టిందన్నారు. ఈ పథకాలతో సీఎం కేసీఆర్ నిరు పేద ఆడ పడుచులకు పెద్దన్నలా అండగా ఉంటున్నారని ప్రశంసించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేందుకు రైతుబంధు, రైతుబీమా, కల్యాణ లక్ష్మి, మిషన్ భగీరథ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. అంతకు ముందు జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. పెగడపల్లి మండలం మద్దులపల్లి గ్రామంలో రూ.4 కోట్ల 61 లక్షల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా రోడ్ల నిర్మాణానికి, శంకుస్థాపనలు, మహిళల, కుర్మ సంఘ భవనాల నిర్మాణానికి ప్రొసీడింగ్ పత్రాలను మంత్రి అందజేశారు. అలాగే పెగడపల్లి మండలం కేంద్రంలోని 2 కోట్ల రూపాయల నిధులతో షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

# యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

## పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

## పాలకుర్తిలో మెగా జాబ్ మేళా నిర్వహణ



జనగావ,సెప్టెంబర్20 : జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించాలని మెగా జాబు మేళా నిర్వహిస్తున్నాం. మొత్తం 80 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొన్నాయి. దీని వలన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించబడుతాయని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో బుధవారం డి.ఆర్.డి.ఎ, జనగామ, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టుల సంయుక్త ఆధ్వర్యంలో పాలకుర్తిలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన మెగా జాబ్ మేళా విజయవంతంగా ముగిసింది. ఈ జాబ్ మేళాలో మల్టీ నేషనల్ కంపెనీలు సహా మొత్తం 80 వివిధ కంపెనీలు పాల్గొనగా, 14వేల 205 మందికి ఉద్యోగావకాశాలు కల్పించడానికి అవకాశాలు ఉండగా, ఆయా ఉద్యోగాల కోసం వేలాదిగా ఉద్యోగార్థులు తరలివచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సీఎం కేసీఆర్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ కృషితో రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. ఇప్పటికే సీఎం కేసీఆర్ రాష్ట్రంలో లక్షా 35వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు చెప్పారు. మంత్రి కేటీఆర్ కృషిత రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు విదేశాల నుంచి పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారని తెలిపారు. తెలంగాణ యువత నైపుణ్యాలు పెంచుకోవాలి. నైపుణ్యం ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు చాలా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమలో జిల్లా కలెక్టర్ శివలింగయ్య, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్ పర్సన్ ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నాప్ గురైన బాలుడు సేఫ్



హైదరాబాద్,సెప్టెంబర్20 : హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రిలో అపహరణకు గురైన ఆరు నెలల బాలుడి కథ సుఖాంతమైంది. కిడ్నాప్ అయిన చిన్నారి నిజామాబాద్‌లో క్షేమంగా ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. బాలుడిని ఎత్తుకెళ్లిన దంపతులను అదుపులోకి తీసుకున్నారు. పిల్లలు లేకపోవడంతో పెంచుకునేందుకు చిన్నారిని అపహరించినట్లు దంపతులు విచారణలో తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. గండిపేట క్రాస్‌లోని ఓ ఫామ్‌హౌజ్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న సల్మాన్ ఖాన్ ? ఫరీదా బేగం దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడికి అస్వస్థతగా ఉండటంతో సెప్టెంబర్ 14వ తేదీన మధ్యాహ్నం నిలోఫర్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. చికిత్స కొనసాగుతుండటంతో బాబును ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. రాత్రి సమయంలో పెద్ద కుమారుడికి చికిత్స కొనసాగుతుండటంతో చిన్న కొడుకు ఫైజల్ ఖాన్‌ను పట్టుకుని తల్లి ఫరీదా బేగం మొదటి అంతస్తులో కూర్చొంది. అదే సమయంలో ఫరీదా బేగం దగ్గరకు వచ్చిన ఓ మహిళ.. ఆమెతో సన్నిహితంగా మెలిగింది. పలు అంశాలపై మాట్లాడుతూ దగ్గరైంది. ఇంతలో భోజనం తెచ్చుకునేందుకు ఫరీదా బేగం వార్డు నుంచి బయటకు వెళ్లింది. తిరిగొచ్చి చూసేసరికి చిన్న బాబు కనిపించలేదు. ఆందోళన చెందిన ఫరీదా బేగం బాబు కనిపించాడా అని చుట్టుపక్కల వాళ్లను అడగ్గా.. అప్పటివరకు ఆమెతో మాట్లాడిన మహిళే బాబును తీసుకెళ్లిందని తెలిపారు. అప్పటిదాకా ఫరీదాబేగంతో సన్నిహితంగా మెలగడంతో వాళ్ల బంధువులే అయ్యి ఉంటారని పట్టించుకోలేదని చెప్పుకొచ్చారు. వాళ్ల సమాధానంతో కంగుతిన్న ఫరీదాబేగం లబోదిబోమంటూ నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. అయితే బాలుడు మిస్సయిన ట్రీట్‌మెంట్ వార్డులో సీసీ కెమెరా లేకపోవడంతో పోలీసుల దర్యాప్తునకు కొంచెం ఆటంకంగా మారింది. అయినప్పటికీ పట్టువదలకుండా కేసు దర్యాప్తు చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. కిడ్నాప్ చేసిన మహిళ నిజామాబాద్‌లో ఉంటుందని గుర్తించారు.

# మహిళా బిల్లు కొందరికి రాజకీయ అంశం

- మాకు మాత్రం మహిళల అభ్యున్నతి లక్ష్యం
- బిల్లుపై చర్చలో విమర్శలను తిప్పికొట్టిన అమిత్ షా



న్యూఢిల్లీ,సెప్టెంబర్20 : కొన్ని పార్టీలకు మహిళా రిజర్వేజన్ బిల్లు రాజకీయ అంశం కావచ్చేమో కానీ, బీజేపీకి ఎంత మాత్రం కాదని, తమ పార్టీకి, తమ నేత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఈ బిల్లు మహిళా సాధికారతకు చెందిన అంశమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కొత్త శకానికి ఆరంభమని, మహిళా ప్రగతికి సంబంధించిన విజన్‌ను ప్రధాని మోదీ జి-20లో ఆవిష్కరించారని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై లోక్‌సభలో బుధవారంనాడు జరిగిన చర్చలో అమిత్‌షా పాల్గొంటూ, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును తమ ప్రభుత్వం మంగళవారంనాడు పార్లమెంటులో ప్రవేశపెట్టిందని, భారత పార్లమెంటరీ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించవలసిన రోజు ఇదని అన్నారు. ప్రధానమంత్రిగా మోదీ ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి మహిళా భద్రత, గౌరవం, సమప్రాధాన్యం అనేవి ప్రభుత్వానికి కీలక ప్రాధాన్యతలుగా ఉన్నాయన్నారు. దేశానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం, విధానాల రూపకల్పనలో మహిళలకు భాగస్వామ్యాన్ని ఈ బిల్లు కల్పిస్తుందని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లు గతంలో నాలుగుసార్లు పార్లమెంటు ముందుకు తీసుకువచ్చారని, కానీ ఆమోదానికి నోచుకోలేదని, ఇది ఐదవ ప్రయత్నమని, ఇప్పుడైనా ఏకగ్రీవంగా బిల్లును ఆమోదించాలని అమిత్‌షా కోరారు. మాజీ ప్రధాని దేవెగౌడ నుంచి మన్మోహన్ వరకూ బిల్లును తీసుకువచ్చేందుకు గతంలో ప్రయత్నాలు జరిగాయని, అయినా బిల్లు ఆమోదించకపోవడానికి కారణం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం జనరల్, ఎస్సీ, ఎస్టీ అనే మూడు కేటగిరిల్లో పార్లమెంటు సభ్యుల ఎన్నిక జరుగుతోందని, ఒక్కో కేటగిరిలో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్ వర్తిస్తుందని చెప్పారు. ఓబీసీలు, ముస్లింలకు రిజర్వేషన్ లేనందున బిల్లుకు మద్దతు ఉండకపోవచ్చంటూ కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని, బిల్లుకు మీరు మద్దతు ఇవ్వకుంటే రిజర్వేషన్ల సత్వర అమలు సాధ్యమయ్యే పనేనా అని ఆయన ప్రశ్నించారు. 'మీరు మద్దతిస్తే, కనీసం ఒక గ్యారెంటీ అయినా ఉంటుంది' అని అమిత్‌షా సూచించారు.ఎన్నికలు పూర్తికాగానే నియోజకవర్గాల పునర్విభజన చేపడతామని, సాధ్యమైనంత త్వరగా లోక్‌సభలో 33 శాతం మహిళా రిజర్వేషన్ అమలును అంతా చూడగలుగుతారని అమిత్‌షా చెప్పారు.

# సీఎం కేసీఆర్ చేసేదే చెప్తాడు..చెప్పింది చేస్తాడు

## రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



వేల్పూర్,సెప్టెంబర్20 : ముఖ్యమంత్రి కేసీఆర్ చేసేది చెప్తాడు.. చెప్పింది చేస్తాడు. అలవికానీ వాగ్దానాల జోలికి వెళ్లకుండా ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెసోళ్ల లెక్క బక్వాస్, బోగస్ హామీలు ఇవ్వడు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఏమీ ఇవ్వరు. ఇక్కడ మాత్రం అలవికానీ అమలు ఇస్తున్నారని మండిపడ్డారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలంలోని పడగల్ గ్రామంలో ప్రభుత్వం నూతనంగా నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల సముదాయాన్ని బుధవారం ప్రారంభించిన మంత్రి లబ్ధిదారులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి పాలు పొంగించారు. అనంతరం నిర్వహించిన సభలో ఇళ్ల పత్రాలను అందించి మాట్లాడారు. డబుల్ బెడ్ పథకంలో ఎలాంటి పైరవీలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులకు ఎంపిక చేశామన్నారు. గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేస్తామని భరోసా ఇచ్చారు. కేసీఆర్ ప్రభుత్వ పాలనలో పేదవారికే ప్రాధాన్యం తప్పా, పైరవీలకు ఏమాత్రం అవకాశం ఉండదని స్పష్టం చేశారు. మలివిడత ఉద్యమం సందర్భంగా ఎంతో బలవంతులైన తెలంగాణ వ్యతిరేక శక్తులను ఎదుర్కొని ఉద్యమనేత కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి ప్రజల ఆకాంక్షను నెరవేర్చారని గుర్తు చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజలందరూ సంతోషంగా ఉండాలన్న ఆకాంక్షతో అనేక సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి ఏదో రూపంలో లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. ఇచ్చిన హామీకి కట్టుబడి కొంత ఆలస్యమైనప్పటికీ అన్ని వసతులతో కూడిన డబుల్ బెడ్ ఇళ్లను నిరుపేదలకు అందిస్తున్నామన్నారు. ఎంపీ అర్వింద్ గతంలో బాండ్ రాసిచ్చి, అబద్ధపు హామీతో ఓట్లు దండుకున్నాడు. ఆ తర్వాత ప్రజలను మోసం చేసి తప్పించుకు తిరుగుతున్నాడు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలతో తెలంగాణకు మేలు జరగదు.కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష. ప్రజలు వాస్తవాలను గుర్తించి అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడుతున్న కేసీఆర్ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలువాలని కోరారు.

# అప్జల్ గంజ్ లో భారీ అగ్ని ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

ఆ ప్రాంతమంతా పొగలు వ్యాపించి, మంటలు చెలరేగిన వెంటనే గుడిసెల్లో ఉన్న వారంతా అప్రమత్తమయ్యారు.. వెంటనే గుడిసెల్లోంచి బయటకు పరుగులు పెట్టారు. దీంతో స్థానికులంతా ప్రాణాలతో బయటపడ్డారు.. సరిగ్గా గత ఏడాది ఇదే ప్రాంతంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది.. తిరిగి అదే ప్రాంతంలో మళ్లీ అదే మంటలు వ్యాపించాయి. వరుస అగ్ని ప్రమాదాలతో స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే పుత్లి బౌలి ప్రధాన రహదారి పక్కనే ఖాళీ స్థలంలో చాలాకాలంగా కొంతమంది గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుండి వలస వచ్చిన వీరిలో కొందరు చెత్త ఏరుకుంటూ కొందరు, బుట్టలను అల్లుకుంటూ మరికొందరు అక్కడే ఏళ్లుగా నివాసం ఉంటున్నారు.. సరిగ్గా అర్ధరాత్రి దాటకా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మొదటగా ఒక గుడిసెలో మొదలైన మంటలు క్షణాల్లో మిగతా గుడిసెలు అన్నిటినీ చుట్టుముట్టాయి. అనంతరం సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, అప్జల్గంజ్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు.. మూడు ఫైరింజల సహాయంతో మంటలనార్పే ప్రయత్నం చేశారు. సుమారు గంట పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.. గుడిసెలకు పక్కనే కార్గో సర్వీసెస్ ఉంది.. దీంతో పదుల సంఖ్యలో బస్సులను అక్కడే పార్క్ చేస్తారు.. మంటలు కార్గో సర్వీసెస్ దాకా వ్యాపించకుండా ఫైర్ సిబ్బంది అదుపు చేశారు.. ఈ ప్రమాదంలో గుడిసెలతోపాటు బాధితులు దాచుకున్న డబ్బు, బట్టలు ఇతరాత్ర వస్తువులు కాలి బూడిదవ్వడంతో బాధితులంతా కట్టు బట్టలతో మిగిలారు. అగ్ని ప్రమాదానికి కారణం హై టెన్షన్ వైర్లు అయ్యి ఉండొచ్చు అని ఫైర్ సిబ్బంది చెబుతున్నారు.. అగ్నికి ఆహుతైన గుడిసెల మీదుగా హైటెన్షన్ వైర్లు వెళుతుంటాయి.. ఆ హై టెన్షన్ వైర్ల మధ్య రాపిడి కారణంగా ఏర్పడిన నిప్పురవ్వలు గుడిసెల మీద పడడంతో మంటలు అంటుకుని ఉండొచ్చని ఫైర్ సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.. సరిగ్గా సంవత్సరం క్రితం ఇదే ప్రాంతంలో అగ్ని ప్రమాదం సంభవించింది.. అప్పుడు కూడా సుమారు 20 కి పైగా గుడిసెలు అగ్నికి ఆహుతయ్యాయి.. గత సంవత్సరం అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ఆ ప్రమాదంలో కుట్ర కోణం ఉంది అని బాధితులు ఆరోపించారు.. వివిధ ప్రాంతాల నుండి వలస వచ్చిన వీరంతా చాలా కాలంగా పుత్లి బౌలి రహదారిని ఆనుకుని మూసి ఒడ్డున నివాసం ఉంటున్నారు.. తమను ఖాళీ చేయించే ప్రయత్నంలో భాగంగా తమ గుడిసెలు తగలబెట్టారని గతంలో వీరంతా ఆరోపించారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లు ఆలస్యం చేయొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఆమె చర్చను ప్రారంభించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ తరపున మద్దతు తెలిపిన సోనియా.. ఈ బిల్లును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో నారీ శక్తి వందన్ అధినియమ్?కు మద్దతుగా తాను ఇక్కడ నిలబడ్డానని తెలిపారు. అడ్డంకులు అన్నింటిని తొలగించి మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని సోనియా కోరారు. భారత జాతీయ కాంగ్రెస్ తరపున నేను '2023-నారీశక్తి వందన్ అధినియమ్'కు మద్దతు తెలుపుతున్నాను. ఈ బిల్లు ఆమోదం పొందుతున్నందుకు మేం సంతోషంగా ఉన్నాం. అలాగే ఆందోళనగా కూడా ఉన్నాం. నేను ఒక ప్రశ్న అడగాలని అనుకుంటున్నాను. గడచిన 13 ఏళ్లుగా భారత మహిళలు తమ రాజకీయ బాధ్యతల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఈ బాధ్యతల కోసం వారు ఇంకా కొన్నాళ్లు ఆగాలి. అదే ఎన్నాళ్లు? రెండేళ్లా, నాలుగేళ్లా.. ఆరేళ్లా.. ఎనిమిదేళ్లా? చెప్పండి. భారత మహిళలతో ఇలాంటి ప్రవర్తన సరైదనదేనా? ఈ బిల్లు(నారీ శక్తి వందన్ అధినియమ్)ను తక్షణమే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. కుల గణనను కూడా నిర్వహించి, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల్లోని మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలని కోరుతున్నామని అన్నారు. అంతకుముందు.. లోక్?సభలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్?రామ్ మేఘవాల్? ప్రసంగించారు. ఈ బిల్లు చాలా ముఖ్యమైనదని.. ఏకగ్రీవంగా ఆమోదించాలని లోక్?సభ సభ్యులను విజ్ఞప్తి చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు మహిళల గౌరవాన్ని పెంచుతుందని అన్నారు. 'బిల్లుపై చర్చ సందర్భంగా ఎలాంటి సూచనలు వచ్చినా ప్రభుత్వం పరిశీలిస్తుంది. పార్లమెంటుతో పాటు అసెంబ్లీలోనూ మహిళలకు రిజర్వేషన్లు వర్తిస్తాయి. మహిళా రిజర్వేషన్ చట్టంతో మహిళా సాధికారత సాధ్యమవుతుంది. పదిహేనేళ్లపాటు మహిళా రిజర్వేషన్ చట్టం అమల్లో ఉంటుంది.' అని అన్నారు. మరోవైపు.. రాజకీయ లబ్ధి కోసమే మహిళా బిల్లును బీజేపీ తెచ్చిందని డీఎంకే ఎంపీ కనిమొళి విమర్శించారు. బిల్లు కోసం గతంలో ఎన్నోసార్లు ఆందోళనలు జరిగాయని.. మహిళలకు వందనాలు కాదు సమానత్వం కావాలని ఆమె అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై మాట్లాడడం పట్ల తాను సంతోషిస్తున్నానని కనిమొళి తెలిపారు.

# మహిళా బిల్లుకు లోక్‌సభ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. విపక్షాలు కూడా ఈ బిల్లుకు మద్దతు తెలుపుతుండటంతో అక్కడ సైతం ఇది ఆమోదం పొందడం ఖాయంగా కనిపిస్తోంది. దీంతో సుదీర్ఘ కాలంగా పెండింగులో ఉన్న ఈ బిల్లు ఉభయ సభల ఆమోదం పొందితే.. మూడు దశాబ్దాల ప్రయత్నం చివరకు ఫలించినట్లు అవుతుంది. దీంతో చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. నారీ శక్తి వందన్ అధినియమ్ పేరుతో ఈ బిల్లును కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సెప్టెంబర్ 19న ప్రవేశపెట్టగా.. బుధవారం దీనిపై చర్చ జరిగింది. దాదాపు ఎనిమిది గంటలపాటు చర్చ అనంతరం.. న్యాయశాఖ మంత్రి తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం ఓటింగ్ నిర్వహించారు. 454 మంది ఎంపీలు అనుకూలంగా.. ఇద్దరు వ్యతిరేకంగా ఓటేశారు. దీంతో చారిత్రాత్మక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లయింది. మహిళా రిజర్వేషన్ బిల్లుపై మాన్యువల్ పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. ఎరుపు, ఆకుపచ్చ స్లిప్పులను సభ్యులందరికీ అందజేశారు. అనంతరం ఓటింగ్ జరిగే పక్రియపై లోకసభ సెక్రటరీ జనరల్ వారికి వివరించారు. బిల్లుకు మద్దతు తెలిపినట్లయితే 'ఎస్' అని ఆకుపచ్చ స్లిప్పుపై రాయాలి. వ్యతిరేకిస్తే ఎరుపు స్లిప్పుపై 'నో' అని రాయాలని చెప్పారు. అనంతరం ఓటింగ్ నిర్వహించారు. రాజ్యాంగ సవరణ కూడా ఉండటంతో మాన్యువల్ పద్ధతిలో ఓటింగ్ చేపట్టారు. ఓటింగ్‌కు కొద్దిసేపటి ముందు ప్రధాని మోదీ సభలోకి వచ్చారు. లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లు మరుసటి రోజు రాజ్యసభ ముందుకు రానుంది. విపక్షాలు కూడా ఈ బిల్లుకు మద్దతు తెలుపుతుండటంతో అక్కడ సైతం ఇది ఆమోదం పొందడం ఖాయంగా కనిపిస్తోంది. దీంతో సుదీర్ఘ కాలంగా పెండింగులో ఉన్న ఈ బిల్లు ఉభయ సభల ఆమోదం పొందితే.. మూడు దశాబ్దాల ప్రయత్నం చివరకు ఫలించినట్లు అవుతుంది. లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లును ఈనెల 21న రాజ్యసభలో ప్రవేశపెడతారు. వెంటనే బిల్లుపై చర్చ జరిపి అదేరోజు ఓటింగ్ నిర్వహిస్తారు. ఉభయసభల ఆమోదం పొందిన వెంటనే బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి పంపుతారు.

# నల్గొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

గాయపడ్డ వారిని దేవరకొండ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందగా.. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. మార్గంమధ్యలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మృతులను మద్దిమడుగు ప్రసాద్ (38), మద్దిమడుగు రమణమ్మ (35), మద్దిమడుగు అవినాష్ (12), పట్నపు మణిపాల్ (18) వనం మల్లికార్జున్ (12)గా గుర్తించారు. ఇదే ప్రమాదంలో మరో ఇద్దరు గాయపడగా వారికి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మహిళా బిల్లుకు పూర్తి మద్దతు చర్చలో రాహుల్ వెల్లడి

ఈ పరిస్థితిని ప్రభుత్వ మార్చాలని సూచించారు.మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణం ఆమోదించి, అమలు చేయాలని కేంద్రాన్ని రాహుల్ కోరారు. నియోజకవర్గాల పునర్విభజన, జనగణనను ఆ తర్వాత చేపట్టవచ్చని, బిల్లు అమలు చేయడానికి వాటి అవసరం లేదని అన్నారు. కుల గణన లెక్కలను బహిరంగం చేయాలని కేంద్రానికి సవాలు విసిరారు. మీరు ఆ గణాంకాలను బయటపెట్టండి. లేకుంటే ఆ పని కాంగ్రెస్ చేస్తుందని రాహుల్ స్పష్టం చేశారు. దీనికి ముందు, లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చలో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ పాల్గొంటూ, మహిళా రిజర్వేషన్ బిల్లుకు తాము మద్దతిస్తున్నట్టు తెలిపారు. వెంటనే బిల్లును అమల్లోకి తీసుకురావాలని, లేదంటే మహిళలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. మహిళలు రాజకీయ బాధ్యతలు చేపట్టాలని గత 13 ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని చెప్పారు.

# రజకులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నరు

## ముస్లిం వాషర్లకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలి

## నయా నిజాంకు మత పిచ్చి ఎక్కువైంది

## బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

హైదరాబాద్,సెప్టెంబర్20 : ముస్లిం వాషర్లకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రయోజనాన్ని వర్తింపజేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ఆదేశించారు. ఈ నేపథ్యంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. ముస్లిం ధోబి ఘాట్లకు, లాండ్రీ షాపులకు 250 యూనిట్ల ఉచిత పథకాన్ని వర్తింప చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ నిర్ణయంతో తరతరాలుగా దోభి వృత్తిపై ఆధారపడి బతుకుతున్న రజకులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడతారని ఆయన మండిపడ్డారు. ఇక గల్లీ గల్లీలో వేరే వర్గానికి చెందిన వాళ్ళ లాండ్రీ షాపులు వెలుస్తాయని, ఓవైసీని సంతోష పెట్టడానికి రజకుల వృత్తిని నాశనం చేస్తారా? అని ఆయన ప్రశ్నించారు. ఈ నయా నిజాంకు మత పిచ్చి ఎక్కువైందంటూ బండి సంజయ్ ధ్వజమెత్తారు. ఒక మతం ఓట్ల కోసం కేసీఆర్ హిందూ సమాజంలో ఉన్న కులవృత్తులను అణిచివేస్తున్నారని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ది మత దురహంకారమని ఆయన విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా.. బీసీల కుల వృత్తులను ఆర్థికంగా దెబ్బతీసి అయినా సరే ఎంఐఎంను సంతృప్తి పరచాలన్నది కేసీ ఆర్ లక్ష్యమని బండి సంజయ్ విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది మైనార్టీ వర్గం ఓట్ల కోసం కేసీఆర్ బీసీల కులవృత్తులపై దాడి చేస్తారా అని ఆయన అన్నారు. ఇప్పటికే వేరే వాళ్లు దూరడంతో తమ కులవృత్తుల వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని బీసీ కులాల వాళ్ళు తీవ్ర మనో వేదనలో ఉన్నారని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో మూలిగే నక్కపై తాటి పండు ఎత్తేసినట్టుగా ఉందని ఆయన అన్నారు.

# రంగారెడ్డి జిల్లాలో పరువు హత్య

హైదరాబాద్,సెప్టెంబర్20 : కూతురు వరస అయ్యే యువతితో అక్రమ సంబంధం పెట్టుకున్న యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన రంగారెడ్డి జిల్లా కేశంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. యువతి తండ్రితో సహా మరో నలుగురు కలిసి ఈ హత్య చేసినట్లుగా తెలుస్తోంది. గత నెల 15న రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలంలో యువకుడిని హత్య చేసి, పాతి పెట్టి పరారయ్యారు. నెల అనంతరం ఓ మహిళతో ఫోన్ మాట్లాడుతూ పోలీసులకు చిక్కారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. బీహార్‌కు చెందిన కరణ్ కుమార్ కోళ్ల ఫారంలో కూలీ పనులు చేస్తుంటాడు. అదే రాష్ట్రానికి చెందిన రంజిత్ కుమార్ కుటుంబంతొ సహా ఉపాధి కోసం వచ్చి స్థానిక కోళ్ల ఫారంలో పని చేస్తున్నాడు. కరణ్ కుమార్, రంజిత్ కుమార్ ఒకే ప్రాంతానికి చెందినవారు. ఇద్దరు వరుసకు సోదరులు. అయితే కరణ్ కుమార్ వావివరసలు మరిచి రంజిత్ కుమార్ కూతురుని ప్రేమించాడు. ఇద్దరి మధ్య సానిహిత్యం పెరిగింది. అయితే విషయం తెలుసుకున్న రంజిత్.. కరణ్ కుమార్‌ను పలుమార్లు మందలించినా అతను వినిపించుకోలేదు. 'నీకు కూడా కూతురే అవుతుంద'ని చెప్పినా కరణ్ కుమార్ ఇవేమీ పట్టించుకోలేదు. దీంతో కరణ్‌ను రంజిత్ గట్టిగా బెదిరించాడు. ఇది జరిగిన కొద్ది రోజుల అనంతరం కరణ్ సిద్దిపేటకు వెళ్లి పనిలో కుదిరాడు. అక్కడి వెళ్లినా అతనిలో మార్పు రాలేదు. యువతి నుదుట కుంకుమ పెట్టిన ఫోటోలు పోస్ట్ చేసేవాడు. ఇలా కరణ్ చేస్తున్న పనులతో విసిగి పోయిన రంజిత్.. కరణ్‌ను అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. తనకు పరిచయమైన వ్యక్తులైన బీహార్‌కు చెందిన సంతోష్ కుమార్, బబ్లు మరో ఇద్దరి మైనర్లు సహాయం తీసుకున్నాడు.. ఇలా రంజిత్ పథకం ప్రకారం ఆగస్టు 15న కరణ్ ఫోన్ చేశాడు. పొలంలో పని ఉందని రమ్మని చెప్పి జూలపల్లి మధ్య రహదారి పక్కకు తీసుకెళ్లాడు. అక్కడే బురద నీటిలో ముంచి ఊపిరాడకుండా చేసి హతమార్చాడు.. అనంతరం అక్కడే పాతి పెట్టాడు. అయితే తన తమ్ముడు కనిపించలేదు అంటూ కరణ్ అన్న దీపక్ గత నెల 29న కేశంపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు రంజిత్ హత్య చేసినట్లుగా గుర్తించారు.. హత్య జరిగిన అనంతరం నిందితులు ఫోన్లను స్విచ్ ఆఫ్ చేయడంతో వారి ఆచూకీ కనుక్కోవడం పోలీసులకు కష్టంగా మారింది. అయితే అనంతరం ప్రకాశం జిల్లా అద్దంకిలో నిందితులు తల దాచుకున్నట్లు గుర్తించారు. కేశంపేట పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## భారత గణతంత్ర వేడుకలకు ముఖ్యఅతిథిగా జోబైడెన్

### ఆహ్వానించిన ప్రధాని నరేంద్రమోడీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్20 : 2024 గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ని ప్రధాని నరేంద్రమోడీ ఆహ్వానించారని అమెరికా రాయబారి తెలిపారు. జనవరి 26, 2024 గణతంత్ర వేడుకలకు హాజరు కావాల్సిందిగా ప్రెసిడెంట్ జో బైడెన్ ని ప్రధాని ఆహ్వానించినట్లుగా భారత్ లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టీ తెలిపారు. జీ20 సదస్సుకు ముందు రోజు ఇరువురు దేశాధినేతల మధ్య జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో మోడీ కోరినిట్లు గార్సెట్టి చెప్పారు. భారతదేశ వ్యూహాత్మక, దౌత్య, ఆర్థిక ప్రయోజనాలు, ఇరు దేశాల మధ్య సంబంధాల బలోపేతాన్ని దృష్టిలో ఉంచుకుని రిపబ్లిక్ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. 2023 గణతంత్ర వేడుకలకు ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫత్తే ఆల్ సిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గతంలో అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా (2015), రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ (2007), ఫ్రాన్స్ మాజీ అధ్యక్షులు నికోలస్ సర్కోజీ (2008), ఫ్రాంకోయిస్ హోలాండే (2016) కూడా గతంలో గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

మరో 24 గంటల్లోనే బంగాళాఖాతంలో అల్పపీడనం

## మళ్లీ భారీ వర్షాలు కురిసే అవకాశం

హైదరాబాద్,సెప్టెంబర్20 : మళ్లీ రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు తప్పేలా కనిపించడం లేదు. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడేందుకు అనుకూల అవకాశాలు ఉన్నాయి.మరో 24 గంటల్లోనే బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుం దని భారత వాతావరణశాఖ ప్రకటించింది. ఇప్పటికే ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఈ ఆవర్తనం పశ్చిమ మధ్య బంగాళాఖాతానికి ఆనుకొని ఉంది. దీని ప్రభావంతో వాయువ్య బంగాళాఖాతంలో రేపటికి అల్పపీడనం ఏర్పడుతుందని ప్రకటించింది భారత వాతావరణం శాఖ. ఉపరితల ఆవర్తనం, అల్పపీడన ప్రభావంతో మూడు రోజుల పాటు కోస్తా, రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని ఐఎండీ ప్రకటించింది. తీరం వెంబడి గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ సూచిస్తోంది. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లా, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో ఉరుములు పిడుగులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది. విశాఖ జిల్లాలోనూ అదే పరిస్థితి కనిపించే అవకాశం ఉంది. కొన్నిచోట్ల ఎండ ఉన్నప్పటికీ.. భూమి వేడెక్కినప్పుడు బలమైన మేఘాలు ఏర్పడి వర్షాలు కురుస్తుంటాయి. ఇటు చిత్తూరు, అన్నమయ్య జిల్లాతో పాటు కొన్ని జిల్లాల్లో చెదురుమదురు వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. తిరుపతి, నెల్లూరు జిల్లాల్లోనూ అదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. ఈ క్రమంలో కోస్తా జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది.

## ఉద్యమకారులను కాల్చి చంపిన చరిత్ర కాంగ్రెస్‌ది

### కేటీఆర్ పిల్లకుంక ప్రధాని గురించి మాట్లాడుతున్నారు

### ప్రధాని మాటలను బీఆర్ఎస్, కాంగ్రెస్ లు వక్రీకరిస్తున్నాయి

### ఎంపీ ధర్మపురి అరవింద్ విమర్శలు

హైదరాబాద్,సెప్టెంబర్20 : కల్వకుంట్ల కుటుంబం మాటలు తెలంగాణ సమాజం నమ్మే పరిస్థితి లేదన్నారు ఎంపీ ధర్మపురి అరవింద్. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్ పిల్లకుంక ప్రధాని గురించి మాట్లాడుతున్నారన్నారు. ప్రధానమంత్రి మాట్లాడి మాటలను బీఆర్ఎస్, కాంగ్రెస్ లు వక్రీకరిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమకారులను కాల్చి చంపిన చరిత్ర కాంగ్రెస్ ది అని ఆయన ఆరోపించారు. తెలంగాణ ఇస్తామని ప్రకటన చేసి కాంగ్రెస్ ఎందుకు వెనక్కి తీసుకుందని ఆయన ధ్వజమెత్తారు. ఆత్మహత్యలకు కారణం కాంగ్రెస్ కాదా అని ఎంపీ అరవింద్ ప్రశ్నించారు. తెలంగాణ ప్రాణ త్యాగాలకు కారణం సోనియాగాంధీ అని ఆయన విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా.. బీజేపీ మూడు రాష్ట్రాలు ఏర్పాటు చేస్తే ఎక్కడ ఎటువంటి గొడవలు జరగలేదు, ఆందోళనలు జరగలేదు, అదే విషయం నరేంద్ర మోడీ చెప్పారని, కాంగ్రెస్ చరిత్రలో హీనులుగానే మిగిలిపోతారన్నారు ఎంపీ అరవింద్. యువత గురించి కేటీఆర్ మాట్లాడుతున్నాడని, సిగ్గుమాలిన కుటుంబం యువత కోసం తొమ్మిదేళ్ల కాలంలో ఏం చేశారని ఆయన ధ్వజమెత్తారు. చదువుకునేందుకు స్కాలర్‌షిప్ కూడా ఇవ్వట్లేదని ఆయన మండిపడ్డారు. ఉద్యమ సమయంలో యువతను రెచ్చగొట్టారని, తెలంగాణలో సారా ఏరులైపారుతుందన్నారు. అంతేకాకుండా.. ఏం ముఖం పెట్టుకొని కేటీఆర్ ట్వీట్లు చేస్తున్నాడని, తొమ్మిదిన్నర ఏళ్ల తెలంగాణను దరిద్రులు లూటీ చేశారన్నారు. యూనివర్సిటీలను నాశనం చేశారని, చేసిన వాగ్దానాలను ఒక్కటి కూడా నిలబెట్టుకోలేదన్నారు. కుటుంబ పాలన కేటీఆర్‌ది అని, కేటీఆర్ కుటుంబం రెచ్చగొట్టడం వల్లే చాలామంది ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. కవిత వాళ్ళ అయ్య మీదనే ఒత్తిడి తేలేదన్నారు. కవిత ఒత్తిడి వాళ్ళ నాయనే వినలేదని, కవిత డ్రామాలు ఆపాలన్నారు. కవిత ఎక్కడ పోటీ చేసినా ఓడిపోవడం ఖాయమని, రాష్ట్ర ప్రభుత్వంలో మహిళలకు ఏం చేశారన్నారు. కవిత వాళ్ళ నాయన చెంపలు వాయించాలని, మహిళలకు మేలు చేయాలని ఆయనపై డిమాండ్ చేయాలన్నారు.

## జనగణన, డీలిమిటేషన్ తర్వాతే మహిళా రిజర్వేషన్లు

### జన గణన 2025 లోపు పూర్తవుతుంది

### బీజేపీ రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు

తిరుపతి,సెప్టెంబర్20 : లోక్‌సభ ముందుకు మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చింది ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. ఈ రోజు లోక్‌సభలో చర్చించి..ఆమోదించే అవకాశం కూడా ఉంది.. అయితే, ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొంది చట్టంగా మారితే.. ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుంది అనే చర్చ సాగుతోంది.. దీనిపై ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోడీ క్లారిటీ ఇచ్చారు.. జనగణన, డీలిమిటేషన్ తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. ఇప్పుడు దీనిపై బీజేపీ రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ.. జన గణనను 2025 లోపు పూర్తి చేయాలని మోడీ సర్కార్ అలోచనగా తెలిపారు.. జనగణన , డీలిమిటేషన్ తర్వాత మహిళ రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయన్న ఆయన.. 2026 నుంచి జరిగే ఎన్నికల్లో మహిళ రిజర్వేషన్లు అమలులోకి వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. చట్ట సభల్లో మహిళ సంఖ్య గణనీయంగా పెరగనుంది అన్నారు జీవీఎల్.. గతంలో మహిళ రిజర్వేషన్ల బిల్లును యూపీఏ సర్కార్ బుట్ట దాఖలు చేసిందని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ సర్కార్ తెచ్చిన మహిళా రిజర్వేషన్ల బిల్లులో అనవసర అంశాలు ఉన్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మా బిల్లు అని చెప్పుకోవడానికి సిగ్గు ఉండాలి అంటూ మండిపడ్డారు. సరైన సమయంలోనే మహిళా రిజర్వేషన్ల బిల్లును మోడీ సర్కార్ తీసుకువచ్చింది.

# నవదీప్ విచారణకు హైకోర్టు ఆదేశం

### 41ఏ నోటీసులు ఇవ్వాలని సూచన



హైదరాబాద్,సెప్టెంబర్20 : మాదాపూర్ డ్రగ్స్ కేసులో హీరో నవదీప్?కు తెలంగాణ హైకోర్టు షాక్ ఇచ్చింది. ఈ కేసులో ఆయనకు 41ఏ నోటీసులు ఇచ్చి విచారణ జరపాలని నార్కోటిక్ పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. అంతకుముందు.. నవదీప్ బెయిల్ రద్దు చేయాలని కోరుతూ.. నార్కోటిక్ విభాగం పోలీసులు కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన.. డ్రగ్స్ సరఫరా చేసే రాంచందర్?తో నవదీప్ కు సంబంధాలున్నాయని.. దాని తాలుకు వాట్సాప్ చాటింగ్ ఆధారాలు సేకరించినట్లు పోలీసులు పేర్కొన్నారు. సంబంధిత వాట్సాప్ చాటింగ్ ఆధారాలను హైకోర్టుకు సమర్పించిన కౌంటర్?లో పొందుపరిచారు. గతంలోనూ నవదీప్‌పై డ్రగ్స్ కేసులున్నాయని తెలిపారు. మరోవైపు మాదాపూర్ డ్రగ్స్ కేసుతో నవదీప్‌కు ఎటువంటి సంబంధం లేదని, గతంలో ఉన్న డ్రగ్స్ కేసుల్లో నిందితుడిగా లేదని నవదీప్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఇరువురి వాదనలను విన్న కోర్టు 41ఏ కింద నవదీప్?కు నోటీసులు ఇచ్చి విచారించాలని నార్కోటిక్ పోలీసులను ఆదేశించింది. నవదీప్‌కు 41ఏ నోటీసులు జారీ చేసి.. అతనిని పిలిచి ప్రశ్నించనున్నారు. ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించిన నార్కోటిక్ విభాగం పోలీసులు.. నవదీప్ ను ప్రశ్నించి అతని నుంచి కీలక సమాచారం సేకరించాలని భావిస్తున్నారు మరోవైపుమాదాపూర్? డ్రగ్స్ కేసులో ఒక్కొక్కటిగా చీకటి కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. పట్టుబడ్డ నిందితులు మత్తుదందాలను అడ్డుపెట్టుకుని.. చిత్రనిర్మాతలుగా అవతారం ఎత్తారని పోలీసుల విచారణలో వెల్లడైంది. నైజీరియన్ల నుంచి మాదకద్రవ్యాలను కొనుగోలు చేసి, రేవ్ పార్టీల వంటి కార్యక్రమాలకు తెరలేపుతున్నారని నార్కోటిక్ పోలీసులు గుర్తించారు. వీటికి సినీ, రాజకీయ మిత్రులను ఆహ్వానించి.. వారితో పరిచయాలు పెంచుకుంటున్నారని తెలిపారు. నిందితులు కల్వార్‌రెడ్డి, బాలాజీ, రాంకిశోర్ సెల్‌ఫోన్ల డేటాలో పలువురు సినీ రంగ ప్రముఖుల ఫోన్ నంబర్లను పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఈ కేసు దర్యాప్తును నార్కోటిక్? పోలీసులు ముమ్మరం చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సినీ నిర్మాతలు వెంకటరత్నారెడ్డి,రవి ఉప్పలపాటిలకు విశాఖపట్నానికి చెందిన రాంకిశోర్, నెల్లూరు జిల్లాకు చెందిన మాజీ నేవీ ఉద్యోగి బాలాజీ ద్వారా డ్రగ్స్ చేరేవని తెలుస్తోంది. బెంగళూరులోని డ్రగ్స్ సరఫరా చేసేనైజీరియన్ల ముఠా తో బాలాజీకి పరిచయాలున్నాయి. అక్కడి నుంచి హెరాయిన్, కొకైన్, ఎల్ఎస్‌డీ బ్లాట్లు తీసుకొచ్చేందుకు రాంకిశోర్ సహకరించేవాడు. డ్రగ్స్?ను బెంగళూరులో ఉంటున్న నైజీరియన్ల నుంచి కొనుగోలు చేసి.. రాష్ట్రంలో సినీ, రాజకీయ ప్రముఖులకు విక్రయించేవారు. గచ్చిబౌలి, మాదాపూర్‌లోని విలాసవంతమైన అపార్టుమెంట్లను అద్దెకు తీసుకుని రేవ్?పార్టీలు నిర్వహించేవారు. మోడళ్లు, సినీ అవకాశాల కోసం ఎదురుచూసే యువతులకు మాదకద్రవ్యాలు ఎరవేసి రప్పించేవారు. మరోవైపు నగరంలో డ్రగ్స్ ముఠా గుట్టురట్టు చేసేందుకు ఇటీవల అరెస్టయిన 8 మంది నిందితులకు పోలీసు కస్టడీ కోరుతూ మంగళవారం న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. మురళీ వెంకట రత్నారెడ్డి, భాస్కర్‌లను అరెస్ట్ చేసినప్పుడు బయటపడిన సమాచారంతో ఈ నెల 14న ముగ్గురు నైజీరియన్లు సహా మాజీ ఎంపీ కుమారుడు దేవరకొండ సురేష్‌రావు, రాంచంద్, సుశాంత్‌రెడ్డి, కె.సందీప్, శ్రీకర్ కృష్ణప్రసాద్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు 7 రోజులు కస్టడీ కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

# సెక్యులర్, సోషలిస్ట్ పదాలు ఎక్కడ??


### మహిళా బిల్లుపైనా పార్లమెంట్‌లో వాడివేడి చర్చ

న్యూఢిల్లీ,సెప్టెంబర్20 : నూతన పార్లమెంట్ భవనంలోకి అడుగుపెట్టిన సందర్భంగా తమకు ఇచ్చిన రాజ్యాంగం కాపీలలో 'సెక్యులర్', 'సోషలిస్ట్' అనే పదాలు కనిపించడం లేదని కాంగ్రెస్ లోక్?సభాపక్షనేత అధీర్ రంజన్ చౌదరి తెలిపారు. 1976లో రాజ్యాంగ సవరణ చేసి ఈ పదాలను చేర్చినట్లు గుర్తు చేసిన అధీర్.. వాటిని తమకు ఇచ్చిన కాపీలలో ఎందుకు పొందుపర్చలేదని ప్రశ్నించారు. ఇది రాజ్యాంగాన్ని మార్చేందుకు చేస్తున్న ప్రయత్నమేనని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియా గాంధీ సైతం ఈ విషయంపై స్పందించారు. రాజ్యాంగ పీఠికలో సోషలిస్ట్, సెక్యులర్ పదాలు కనిపించడం లేదని చెప్పారు. మరోవైపు, కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ ఈ విషయంపై బీజేపీ సర్కారు లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. 'ఇదెలా జరుగుతుంది? మనసులో ఏది ఉంటే.. అదే మన చేతల్లో కనిపిస్తుంది. ఇప్పుడు రాజ్యాంగ పీఠికను మార్చేశారు. చాలా ముఖ్యమైన సోషలిస్ట్, సెక్యులర్ పదాలను కనిపించకుండా చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చిన స్పష్టమైన సందేశమిది. ఇది దురదృష్టకరం' అని కేసీ వేణుగోపాల్ అన్నారు. సీపీఐ నేత బినోయ్ విశ్వం సైతం ఈ రెండు పదాలను విస్మరించడంపై తీవ్రంగా స్పందించారు. వాటిని లేకుండా రాజ్యాంగ కాపీలు ఇవ్వడాన్ని తప్పుబట్టారు. ఇది నేరపూరిత చర్య అని విమర్శించారు. అయితే, ఈ విషయంపై స్పందించిన కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్.. రాజ్యాంగం అసలైన వెర్షన్? కాపీలను సభ్యులకు ఇచ్చినట్లు వివరణ ఇచ్చారు. సోషలిస్ట్, సెక్యులర్ అనే పదాలను రాజ్యాంగ సవరణ చేసి తర్వాత చేర్చారని అన్నారు. 'ఇవి (తాజాగా పంపిణీ చేసిన రాజ్యాంగం కాపీలు) అసలైన పీఠిక ఆధారంగా ఉన్నాయి. ఆ తర్వాత సవరణలు జరిగాయి' అని అన్నారు. హిళా రిజర్వేషన్ బిల్లుపై వాడివేడి చర్చ సందర్భంగా బుధవారం మహిళా ఎంపీల పేలుడు ప్రసంగాలతో కొత్త పార్లమెంట్ ప్రతిధ్వనించింది. మాజీ కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, డీఎంకే ఎంపీ కనిమొళి, ఎన్‌సీపీకి చెందిన సుప్రియా సూలే మహిళలను గౌరవించడంలో విఫలమయ్యారని ప్రభుత్వంపై విరుచుకుపడగా.. కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ స్పందిస్తూ ప్రభుత్వం మహిళలను లెక్కించిందని, గౌరవించిందని ప్రకటించారు. చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను ప్రతిపాదిస్తున్న ఈ బిల్లుపై చర్చ కోసం సోనియా గాంధీ ఏడు గంటల సమయం కేటాయించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మేం మద్దతు ఇస్తాం అని ప్రకటించారు కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ.. వంటిల్లు నుంచి ప్రపంచవేదికల వరకు భారత మహిళల పాత్ర ఎంతో ఉందన్న ఆమె.. మహిళలు వారి స్వార్థం గురించి ఏనాడూ ఆలోచించరని తెలిపారు.. స్వాతంత్ర్య పోరాటంలో మహిళల పాత్ర మరువలేనిదని కొనియాడారు.. ఆధునిక భారత నిర్మాణంలో పురుషులతో కలిసి మహిళలు పోరాడారు.. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు రాజీవ్ గాంధీ అందించారని గుర్తుచేశారు.. పీవీ నరసింహారావు నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వమే ఈ రిజర్వేషన్లను అమలుచేసిందన్న ఆమె.. అందువల్లే ఈ రోజు దేశంలో 15 లక్షల మంది మహిళలు అధికారాన్ని దక్కించుకున్నారని తెలిపారు. ఈ బిల్లుకు కాంగ్రెస్ పార్టీని సమర్థిస్తోందని స్పష్టం చేశారు. సరోజిని నాయుడు, సుచేత కృపలానీ, అరుణ్ అసఫ్ అలీ, విజయలక్ష్మీ పండిత్ వంటి వారెందరో దేశం కోసం పోరాడారంటూ స్మరించుకున్నారు సోనియా గాంధీ.. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ నేడు లోక్‌సభలో పార్టీ చర్చకు నాయకత్వం వహించారు. లోక్‌సభలో బిల్లుపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ మహిళా రిజర్వేషన్ బిల్లు కింద ఓబీసీ, ఎస్సీ కోటా డిమాండ్ చేయడంతో బీజేపీ, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం నెలకొంది. భారతీయ మహిళల త్యాగాలు, విజయాలను ప్రస్తావించిన సోనియా గాంధీ, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను ప్రవేశపెట్టినందుకు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి ఘనత వహించారని గుర్తుచేశారు. వీలైనంత త్వరగా బిల్లును అమలు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తుందని, మహిళా రిజర్వేషన్ బిల్లులో షెడ్యూల్డ్ కులాలు, ఓబీసీలకు తక్షణమే కుల గణన, కోటా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు సోనియా గాంధీ.. బీజేపీకి చెందిన నిషికాంత్ దూబే ఈ డిమాండ్‌ను బిల్లు నుంచి మళ్లించడానికి, మహిళా బిల్లుకు క్రెడిట్ కొట్టే ప్రయత్నంగా అభివర్ణించారు. ఓబీసీ రిజర్వేషన్ల గురించి కాంగ్రెస్ గతంలో ఎన్నడూ మాట్లాడలేదని, రాజకీయ కోణాల కోసం ఇప్పుడు ఈ కొత్త అంశాలు తెరపైకి తెస్తున్నాయని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించి డీఎంకే నాయకురాలు కనిమొళి బుధవారం లోక్‌సభలో మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు రిజర్వేషన్లకు సంబంధించినది కాదని, పక్షపాతం, అన్యాయాన్ని తొలగించే చర్య అని అన్నారు. మహిళలకు సమాన గౌరవం కావాలని అన్నారు. ఈ బిల్లు అమలయ్యే వరకు ఎంతకాలం వేచి చూడాలని ఆయన అన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లు 'నారీ శక్తి వందన్ అధినియం'పై జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ల అమలుపై ప్రభావం చూపేందుకే బిల్లులో 'డీలిమిటేషన్ తర్వాత' అనే క్లాజును తొలగించాలని.. మితిమీరిన జాప్యం జరిగే అవకాశం ఉందన్నారు.బిల్లులో ప్రతిపాదించిన లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు జనాభా లెక్కలు, డీలిమిటేషన్ ప్రక్రియ తర్వాత మాత్రమే అమలు చేయబడతాయి.ఈ బిల్లును అమలు చేసేందుకు ఎంతకాలం వేచి చూడాలని ఆయన అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దీన్ని సులభంగా అమలు చేయవచ్చు. ఈ బిల్లు రిజర్వేషన్ కాదని, పక్షపాతం, అన్యాయాన్ని తొలగించే చర్య అని మీరు అర్థం చేసుకోవాలన్నారు.టోకెనిజం రాజకీయాలు ఆలోచనల రాజకీయంగా మారాలని ఆమె ఉద్ఘాటించారు. ఈ బిల్లుకు 'నారీ శక్తి వందన్ చట్టం' అని పేరు పెట్టారు. మాకు సెల్యూట్ చేయడం ఆపండి. మాకు నమస్కారం అక్కర్లేదు, పీఠాలు వేయకూడదు, పూజలు చేయకూడదు%ూ% సమానంగా గౌరవించాలని ఆమె అన్నారు. తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత చాలా బలమైన మహిళ అని ఒప్పుకోవడానికి ఎలాంటి సంకోచం లేదని కనిమొళి అన్నారు. తమిళనాడులో డీఎంకే ప్రత్యర్థి అన్నాడీఎంకే అధినేత్రి జయలలిత. మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించి ప్రతిపక్ష నేతలు కచ్చితంగా బిల్లుకు మద్దతు ఇస్తున్నారు కానీ బీజేపీపై దాడికి వెనుకాడడం లేదు. ఎన్‌సీపీ ఎంపీ, శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే బీజేపీపై మాటల దాడి చేశారు. బీజేపీ మహిళల పట్ల తప్పుగా ఆలోచిస్తోందని ఆరోపించారు. ఇది బీజేపీ మాత్రమేనని, ఇంటికి వెళ్లి భోజనం వండమని మహారాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు నాతో చెప్పారని అన్నారు. బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే వ్యాఖ్యలపై సుప్రియా సూలే స్పందించారు. పార్లమెంట్‌లో బిల్లుపై చర్చ సందర్భంగా దూబే మాట్లాడుతూ మహిళలను కించపరిచే, కించపరిచే మాటలు మాట్లాడే వారికి భారతదేశం అనుకూలంగా ఉందని అన్నారు. 2010లో యూపీఏ ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టిందని పేర్కొన్న సోనియా గాంధీపై కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ విరుచుకుపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బిల్లు యూపీఏ హయాంలోనిదేనని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ గట్టిగా స్పందించారు. సోనియా పేరు ఎత్తకుండానే విమర్శల వర్షం కురిపించారు. 2010లో బిల్లు తీసుకొచ్చిన వాళ్లు దాన్ని ఎందుకు పాస్ చేయలేకపోయారని ప్రశ్నించారు. ఇప్పుడు మాత్రం "ఇది మా బిల్లు" అని చెప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. మతపరమైన కోటాలు అడుగుతూ కాంగ్రెస్ దేశాన్నితప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఇలా మహిళా రిజర్వేషన్ బిల్‌పై ఎన్నో వాదోపవాదాలు జరిగాయి. ఇదిలా ఉంటే అమిత్ షా చర్చ సమయంలో కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై మాట్లాడేందుకు లేచినిలబడిన బీజేపీ ఎంపీ నిశీకాంత్ దూబేను కాంగ్రెస్ నేత రధీర్ రంజన్ చౌదరీ అడ్డుకోవడంతో ఒక్కసారిగా గందరగోళం ఏర్పడింది. నారీ శక్తి వందన్ అధినియంపై కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ మాట్లాడిన తర్వాత బీజేపీ తరుపున నిశికాంత్ దూబే మాట్లాడేందుకు నిలబడ్డారు. ఆ సమయంలో కాంగ్రెస్ ఎంపీ అధీర రంజన్ చౌదరీ మహిళా ఎంపీని నామినేట్ చేయాలని పట్టుబట్టడంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది.

దీంతో అమిత్ షా జోక్యం చేసుకున్నారు. కాంగ్రెస్ పై విమర్శలు గుప్పించారు. తొలుత తనను మాట్లాడిలేనందుకు ఆయన అసూయగా ఉన్నారని కౌంటర్ ఇచ్చారు. " నేను అధీర్ జీని అడగాలను కుంటున్నాను, మహిళలు మాత్రమే మహిళల గురించి శ్రద్ధ చూపిస్తారా..? మహిళల గురించి పురుషులు మాట్లాడకూడదా..? మీరు ఎలాంటి సమాజాన్ని నిర్మించాలని అనుకుంటున్నారు..? మహిళా సంక్షేమంపై సోదరుడు ఒక అడుగు ముందుకేయాలి అనేది మన దేశ సంప్రదాయం. మహిళా సంక్షేమం గురించి ఆలోచించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది.మరి నిషికాంత్ జీ మా వైపు నుండి మాట్లాడటానికి లేచి నిలబడితే, అతని (చౌదరి) అభ్యంతరం ఏమిటి?బహుశా అతనికి మొదట మాట్లాడే అవకాశం రాకపోవటం వల్ల, అతను కొంచెం అసూయపడుతున్నాడు" అంటూ అమిత్ షా విమర్శలు గుప్పించారు.

## భారీగా పతనమైన స్టాక్ మార్కెట్లు

### 20,000 పాయింట్ల దిగువకు నిఫ్టీ




న్యూఢిల్లీ,సెప్టెంబర్20 : బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు రావడం సహా, విదేశీ పెట్టుబడులు తరలివెళ్లడం కూడా ఇందుకు కారణం. దీనికితోడు యూఎస్ ఫెడరల్ రిజర్వ్ త్వరలో కీలక వడ్డీ రేట్లను ప్రకటించనున్న నేపథ్యంలో.. మదుపరులు ఆచితూచి వ్యవహరిస్తుండడం కూడా.. మ్మార్కెట్ పతనానికి మరో కారణం. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ సెన్సెక్స్ 796 పాయింట్లు నష్టపోయి 66,800 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ నిఫ్టీ 231 పాయింట్లు కోల్పోయి 19,901 వద్ద స్థిరపడింది.లాభపడిన షేర్స్ : పవర్‌గ్రిడ్, ఏషియన్ పెయింట్స్, సన్‌ఫార్మా, యాక్సిస్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, ఐటీసీ, టీసీఎస్‌నష్టపోయిన స్టాక్స్ : హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్, టాటా స్టీల్, మారుతి సుజుకి, విప్రో, టైటాన్‌భారీగా నష్టపోయిన బ్యాంకింగ్, ఆయిల్ స్టాక్స్ బుధవారం దేశీయ బ్యాంకింగ్, ఆయిల్ స్టాక్స్ భారీగా నష్టపోయాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 4 శాతం మేర నష్టపోయింది. దీనితోపాటు ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, కోటక్ బ్యాంక్, రిలయన్స్, ఐఓసీ, బీపీసీఎల్.. కూడా నష్టాలను చవిచూశాయి. బుధవారం టోక్యో, షాంఘై, హాంకాంగ్ మార్కెట్లు భారీ నష్టాలతో ముగిశాయి. ఒక్క సియోల్ స్టాక్ మార్కెట్ మాత్రం స్వల్ప లాభాలతో గట్టెక్కింది.మంగళవారం యూఎస్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. అయితే ప్రస్తుతానికి యూరోపియన్ మార్కెట్లు మాత్రం లాభాలతో ట్రేడ్ అవుతున్నాయి. ఎక్స్ఛేంజ్ డేటా ప్రకారం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు సోమవారం రూ.1,236.51 కోట్లు విలువైన పెట్టబడులను భారత్ నుంచి ఉపసంహరించుకున్నారు.

## కెనడా ప్రధాని వ్యాఖ్యలపై వివాదం

### మంత్రి జైశంకర్‌తో ప్రధాని మోడీ భేటీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్20 : ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ కెనడాలో హత్యకు గురయ్యాడు. ఈ హత్యవెనక భారత్ ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో అక్కడి పార్లమెంట్ లో ఆరోపించడం వివాదాస్పదమైంది. అంతేకాకుండా అగ్రశ్రేణి భారత దౌత్యవేత్తను కెనడా బహిష్కరించింది. దీనికి ప్రతిగా భారత్ కూడా కెనడా సీనియర్ దౌత్యవేత్తను 5 రోజుల్లో భారత్ వదిలి వెళ్లాలని ఆదేశించింది. కెనడా వ్యాఖ్యలు పూర్తిగా అసంబద్ధ, ప్రేరేపిత వ్యాఖ్యలని భారత్ ఖండించింది.ఇదిలా ఉంటే రెండు రోజులుగా ఇరుదేశాల మధ్య ఏర్పడిన దౌత్య ఉద్రిక్తతలను గురించి ప్రధాని మోడీ ఆరా తీశారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ లోనే విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తో ఆయన భేటీ అయ్యారు. కెనడా సమస్యలపై జైట్కశంకర్ ప్రధాని మోడీకి వివరించినట్లు సమాచారం. సోమవారం కెనడా పార్లమెంట్ లో ఆ దేశ ప్రధాని ట్రూడో మాట్లాడుతూ.. ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్(కేటీఎఫ్) చీఫ్ హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనక భారత ఏజెంట్ల హస్తం ఉందని ఆరోపించారు. ఈ ఏడాది జూన్ నెలలో కెనడాలోని సర్రే ప్రాంతంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు హర్దీప్ సింగ్ నిజ్జర్ ని కాల్చి చంపారు. ఈ హత్యపై కెనడా దర్యాప్తు ఏజెన్సీలు విచారణ చేస్తున్నాయని ట్రూడో అన్నారు. భారత్ నుంచి పంజాబ్ ని వేరు చేసి ప్రత్యేక దేశం ఏర్పాటు చేయాలనే ఖలిస్తాన్ ఉగ్రమూకలు ప్రయత్నిస్తున్నాయి. ముఖ్యంగా ఇందుకు కెనడా వేదిక అవుతోంది. పలుమార్లు భారత్ కెనడాకు తన అభ్యంతరాన్ని తెలియజేసింది. అయినా అక్కడి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కెనడా నెలను భారత వ్యతిరేఖ చర్యలకు ఉపయోగించవద్దని కోరింది. ఖలిస్తాన్ రెఫరెండం పేరుతో పలుమార్లు ఓటింగ్ నిర్వహించారు వేర్పాటువాదులు. ఇటీవల జీ20 సమావేశానికి వచ్చిన ట్రూడోతో కూడా ప్రధాని నరేంద్రమోడీ తన తీవ్ర అభ్యంతరాన్ని లేవనెత్తారు.

# కొత్త పార్లమెంట్ చారిత్రక నిర్ణయాలకు వేదిక కావాలి!

కొత్త పార్లమెంట్ చారిత్రాత్మక నిర్ణయాలకు వేదిక కావాలి. రాజకీయాలకు దూరంగా దేశహితం కోసం తీసుకునే నిర్ణయాలు చారిత్రాత్మకం కావాలి. మహిళా బిల్లు కావచ్చు...జమిలి ఎన్నికలపై చర్చ కావచ్చు..మనదేశాన్ని భారత్‌గా గుర్తించే నిర్ణయం కావచ్చు.. హుందాగా సాగాలి. మనమంతా కొత్త భారత్ వైపు అడుగుల వేస్తున్నామని గుర్తించాలి. విషయమేదైనా చర్చ హుందాగా చూడాలి. కొత్త పార్లమెంట్ ప్రతిష్టను నిలపాలి. మధ్యయుగాల నాటి రాచరిక వ్యవస్థను వదిలించుకొని, ఆధునిక యుగ విధానమైన ప్రజాస్వామ్యాన్ని పలు దేశాలు అమలు చేసుకుటున్నాయి. కానీ నేటికీ కొన్ని దేశాల్లో ప్రజాస్వామ్య వ్యవస్థలు రాచరిక వ్యవస్థలకు నకళ్లుగా మిగిలిపోయి విమర్శల పాలవుతున్నాయి. ముఖ్యంగా వలస దేశాల నుంచి దాస్య విముక్తం అయిన భారత దేశం వంటి మూడవ ప్రపంచ దేశాలు పేరుకు ప్రజాస్వామ్యాలైనా ఆధునిక చట్టాల అమలు విషయంలో యూరోప్ దేశాల కంటే చాలా వెనుకబడి ఉన్నాయి. దేశ చట్టాల కంటే వ్యక్తులు, నాయకులు సర్వోన్నతులం, అధికులం అనుకునే అహంకార ధోరణులకు ఇక్కడి వ్యక్తులు దూరం కాలేకపోతున్నారు. ప్రజల చేత, ప్రజల కోసం, ప్రజలే ఎన్నుకునే ప్రభుత్వ విధానమైన ప్రజాస్వామ్యం బలపడాలి. ప్రజల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం, వారి సంరక్షణ కోసం పని చేస్తున్నాయా అన్నది ఆలోచించాలి. ఎన్నికల పక్రియలో విజయం సాధించిన పార్టీ, నాయకులు, ప్రజా సంక్షేమం కన్నా వారి పార్టీని అధికారంలో నిలబెట్టుకోవడానికే పూర్తి పదవీకాలం సరిపోతున్నది. దీన్నిబట్టి చూస్తే పాలకులు ప్రజా సంరక్షణకు మించి తమ పార్టీ సంరక్షకులుగా ఎక్కువ సమయాన్ని కేటాయిస్తూ డబ్బు, శ్రమను దుర్వినియోగం చేస్తున్నారు. ఈ క్రమంలో మనం సమస్య ఏదైనా చర్చించాలి. ప్రజలకు మేలు చేస్తున్నామా లేదా అన్నది ఆలోచించాలి. సద్దుమణిగిందని అనుకున్నప్పుడల్లా జమిలి వివాదం మళ్లీ మళ్లీ రాజుకోవటం జరుగుతోంది. ఇందులోని మంచిచెడులను చర్చించాలి. వ్యవహారం ఎలా ఉన్నా .. విషయం ఏదైనా చర్చల ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందా లేదా అన్నది ముఖ్యం. ఇకపోతే జమిలిపై మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసినట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. పార్లమెంటుకూ, అసెంబ్లీ లకూ ఏకకాలంలో ఎన్నికలు జరగాలనీ, అందువల్ల ఎంతో ప్రజాధనం ఆదా అవుతుందనీ ఆ విధానాన్ని మోడీ తదితరులంతా సమర్థిస్తున్నారు. అంతేకాదు, తరచు ఎన్నికలవల్ల అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతున్నది. ఇప్పటివరకు ఓటర్లను ప్రలోభపెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందటానికి ఉద్దేశించే పథకాలను మాత్రం అనుసరిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక ప్రకటించకుండా ఆపుతున్నారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నికలు' అన్న నినాదం కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచీ వినిపిస్తోంది. అంతక్రితం 2003లో అప్పటి ప్రధాని వాజ్‌పేయి ఈ విషయంలో కొంత ప్రయత్నం చేశారు. అప్పటి కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీతో ఆయన చర్చించారు. కానీ ఎందుకనో తదుపరి చర్యలేమీ లేవు. జస్టిస్ బీపీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలోని లా కమిషన్ సమర్పించిన 170వ నివేదిక సైతం చట్టసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇంకా వెనక్కు వెళ్తే 1983లో కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఈమాటే చెప్పింది. అయితే రాజ్యాంగ సవరణ, ప్రజాప్రాతినిధ్య చట్టం సవరణ, చట్టసభల నియమ నిబంధనల సవరణ వగైరాలు చేయకుండా జమిలి ఎన్నికలు సాధ్యంకాదని 2018లో జస్టిస్ బీఎస్ చౌహాన్ నేతృత్వంలోని లా కమిషన్ తన ముసాయిదా నివేదికలో అభిప్రాయపడింది. ఒక ఏడాది వేర్వేరు నెలల్లో ఎన్నికలు జరిగే రాష్ట్రాలన్నిటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించటం ఉత్తమమని సూచించింది. అలాగని జమిలి జరగేలదని కాదు. దేశంలో జమిలి ఎన్నికలు 1952 నుంచి 1967 వరకూ జరిగాయి. కానీ దానికి తూట్లు పొడిచింది కేంద్రంలోని పాలకులే. అప్పటి నెహ్రూ సర్కారు 1959 జూలైలో ఈఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వంలోని తొలి కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాన్ని 356వ అధికరణ ప్రయోగించి బర్తరఫ్ చేసింది. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని చక్కదిద్దేవరకూ ఆ అధికరణ దశాబ్దాలపాటు దుర్వినియోగం చేశారు. ఫిరాయింపులను ప్రోత్సహించే ధోరణి వెర్రితలలు వేసి ప్రభుత్వాలు కుప్పకూ లాయి. అసెంబ్లీలు రద్దయ్యాయి. ఈ కారణాలన్నిటివల్లా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలది తలోదారీ అయింది. పాలక పార్టీలను చీల్చటం, చీలికవర్గంతో కొత్త ప్రభుత్వాలను ప్రతిష్ఠించటం రివాజైంది. ఇలాంటివన్నీ కొత్త పార్లమెంటులో చర్చ సందర్భంగా చర్చించాలి. తరచూ ఎన్నికల వల్ల ఖజానాకు తడిసిమోపెడు ఖర్చు అవుతున్నదన్నది వాస్తవం. దీనికితోడు రాజమార్గాల్లో, దొంగదారుల్లో ఎన్నికల జాతరకు వచ్చిపడే వేల కోట్ల రూపాయలు ద్రవ్యోల్బణాన్ని పెంచుతున్నాయి. ఉదాహరణకు 2009 సార్వత్రిక ఎన్నికలకు ఖజానాకు రూ.1,115 కోట్లు ఖర్చ యితే, 2014 నాటికి ఇది రూ.3,870 కోట్లకు పడగలెత్తింది. ఇదంతా సర్కారుకయ్యే వ్యయం. పార్టీలూ, అభ్యర్థులూ చేసే ఖర్చు ఇందుకు ఎన్నో రెట్లు ఎక్కువుంటుంది. ఈ సమస్యలకు జమిలి ఎన్నికలే పరిష్కార మయితే చర్చించాలి. ఎన్నికల్లో ధనప్రభావం అరికట్టడానికి ఎన్నికల సంస్కరణలు అవసరం. ఎన్నికల విశ్వసనీయత పెంచటానికి దొంగ ఓట్లను అరికట్టడం అవసరం. అలవిమాలిన వాగ్దానాల తో ప్రజలను ఆకర్షించి, అధికారంలోకొచ్చాక వంచించే పార్టీలపై చర్యలు తీసుకోవటం అవసరం. దశాబ్దాల పోరాటం, వేల ఆత్మల బలిదానంతో సంపాదించిన స్వాంత్ర్యం సరైనదిశలో నడుస్తుందా లేదా అన్నది చర్చించాలి. ఇప్పటి వరకు జరిగిన అవలక్షణాలన్నీ చర్చించే ధైర్యం చేయాలి. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేలా మన కొత్త పార్లమెంట్ చర్చ చేయాలి.

# తెలంగాణ ఉద్యమ ఆది గురువు కొండా లక్ష్మణ్

**సెప్టెంబర్ 21.. బాపూజీ వర్ధంతి**



(రామ కిష్టయ్య సంగన భట్ల)
94405 95494

భారత స్వాతంత్ర్య పోరాటంలో , ముల్కీ ఉద్యమంలో , నిరంకుశ నిజాం వ్యతిరేక పో రాటంలో , తెలంగాణ 1969 నాటి తొలి, ఇటీ వలి మలి దశ ఉద్యమాలలో కీలక పాత్రలు వహించిన, జీవితాంతం తెలంగాణ సమస్య లపై పోరాటం చేసిన తెలంగాణ పక్షపాతి దివంగత కొండా లక్ష్మణ్ బాపూజీ. ఏక కాలంలో నాలుగు భిన్నమైన, అంతర్గత సంబంధం కలిగి ఉన్న ప్రజాఉద్యమాలతో ఆయన జీవితం ముడివడి ఉన్నదని చెప్పడం సముచితం. అవి వరుసగా నిజాం వ్యతిరేక పోరాటం, వెనుకబడిన కులాల ఉద్యమం, చేనేత సహకారోద్యమం, ప్రత్యేక తెలంగాణోద్యమం. వాస్తవానికి తెలంగాణ ఉద్యమానికి ఆయన ఆది గురువు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర వితం ముడివడి ఉన్నదని చెప్పడం సముచితం.

1969లో తొలి దశ పోరాటంలోనే కీలక పాత్ర పోషించి, మంత్రి పదవిని కూడా తృణ ప్రాయంగా త్యజించిన త్యాగశీలి. తెలంగాణ వాసుల కష్టాలు తీరాలంటే, ప్రత్యేక రాష్ట్ర సాధన తప్ప వేరే మార్గం లేదని భావించి, అందుకు వివిధ మార్గాలలో నిరసన స్వరాలు వినిపించాడు. అలనాటి నిజాం సంస్థానంలో ఆదిలాబాద్ జిల్లా వాంకిడి గ్రామంలో 1915 సెప్టెంబర్ 27న కొండా లక్ష్మణ్ జన్మించాడు. చిన్నతనాన తల్లిని కోల్పోగా, ప్రాథమిక విద్య ఆసిఫా బాద్ లో, హైదరాబాద్ లో న్యాయ శాస్త్ర విద్య పూర్తి చేసి, 1948లో న్యాయ వాద వృత్తి చేపట్టాడు. ఆనాడు నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించిన వారి పక్షాన కేసులను వాదించి, గెలిపించే వాడు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నాడు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన , దేశంలోని అంతర్భాగమైన నిజాం ఏలుబడిలో ఉన్న తెలంగాణ, నిజాం నిత్య అకృత్యాలకు లోనైన దుస్థితిలో తెలంగాణ విమోచనోద్యమంలో క్రియా శీలక పాత్ర పోషించాడు. 1947 డిసెంబర్ 4న నిజాం ప్రభువు పై బాంబులు విసిరిన నారాయణరావు పవార్ బృందంలో కొండా లక్ష్మణ్ కూడా నిందితుడే. కొంతకాలం అజ్ఞాతుడుగా ఉన్నాడు. నిజాం నిరంకుశ పాలన పై నిప్పుల వర్షం కురిపిస్తూ, ఆయన పాలన అంతానికి,తిరుగుబాటు బావుటా ఎగురవేసి, తొలుదొలుత వ్యూహ రచన చేసింది బాపూజీయే. 1952 లో తొలిసారి ఆసిఫాబాద్ శాసనసభ కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి, శాసనసభలో అడుగు పెట్టాడు. 1957లో చిన్న కొండూరు నుండి గెలుపొంది శాసనసన డిప్యూటీ స్పీకర్ గా బాధ్యతలు స్వీకరించాడు. 1962లో స్వల్ప తేడాతో ఓటమి పాలైనా, ప్రత్యర్థి అక్రమాలతో గెలిచారని కేసు పెట్టి, విజయం సాధించాడు. 1967లో భువనగిరి నుండి గెలిచాడు. 1957-60 వరకు ఉమ్మడి రాష్ట్రం డిప్యూటీ స్పీకర్‌గా, అనంతరం దామోదరం సంజీవయ్య క్యాబినేట్‌లో ఎక్సైజ్, చేనేత, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రిగా, బ్రహ్మనందరెడ్డి మంత్రివర్గంలో కార్మిక, సమాచార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. తర్వాత సీఎం పదవికోసం పీవీ



నరసింహారావుతో పోటీ పడ్డాడు. సీఎం పదవి దక్కనందుకు గవర్నర్‌గా నియమిస్తామని నాటి ప్రధాని ఇందిరాగాంధీ పిలిచి చెపితే, సున్నితంగా తిరస్కరించాడు. కాసు బ్రహ్మనంద రెడ్డి ముఖ్యమంత్రిత్వ ప్రభుత్వంలో కేబినెట్ మంత్రిగా ఉంటూ, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ పక్షపాతిగా ఉద్యమ ఉధృతి కోసం రాజీనామా చేశాడు. 1969 మార్చి 27న తన రాజీనామాను ముఖ్యమంత్రి కాసు బ్రహ్మనందరెడ్డికి అందజేసిండు. దాన్ని ఆమోదిస్తున్నట్లు సీఎం ప్రకటించిండు.

ఈ రాజీనామా ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఒక చారిత్రక మలుపు తిప్పిందని చెప్పవచ్చు. 1972లో భువనగిరి నుండి విజయం కైవసం చేసుకున్నాడు. 1973 లో పాములపర్తి వేంకట నరసింహారావు తదనంతరం ముఖ్యమంత్రి అయ్యే అవకాశం గడప తొక్కిన , ఇందిరా గాంధీ ఒప్పుకున్నా, నాటి హోం మంత్రి ఉమా శంకర్ దీక్షిత్ పట్టు వల్ల వెంగళరా వు కు ముఖ్య మంత్రి అయ్యే ఛాన్స్ దొరికింది. 1958లో హుస్సేన్ సాగర్ తీరాన భూమి కొనుక్కుని జలదృశ్యం నిర్మించు కోగా, 2002 లో చంద్రబాబు ప్రభుత్వం దాన్ని నేలమట్టం చేయించగా , కోర్టు కెళ్ళి తనకు అనుకూల తీర్పు పొందాడు. చివరకు 97వ సంవత్సరంలో 2012 సెప్టెంబర్ 21న మరణించగా , జలదృశ్యం లోనే అంత్య క్రియలు జరిగాయి. 1952లో ముల్కీ ఉద్యమంతో తెలంగాణ కోసం పోరాటం ప్రారంభించి, ప్రత్యేక రాష్ట్రం కోసం తొలి రాజీనామా చేసి, 97 ఏళ్ల పండు ముదుసలి వయసులో, ఎముకలు కొరికిన చలిని లెక్క చేయక ఢిల్లీలో దీక్ష చేసి, గాంధీ మార్గంలో శాంతియుత పోరాటాన్ని ఎంచుకుని, బాపూజీ గా పిలువబడే కొండా లక్ష్మణ్, తన ఆస్తులను , జీవితాన్ని ధారబోసి, కొండంత గొప్ప వ్యక్తిత్వం, నిబద్ధత కలిగిన రాజకీయ ఆదర్శ నేతగా గుర్తింపు నొందాడు. 2000లో మలి దశ ఉద్యమం ప్రారంభించిన కేసీఆర్‌ను ప్రోత్సహించడమే కాదు సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న తన నివాస బంగ్లా జలదృశ్యంను టీఆర్ఎస్ ప్రధాన కార్యాలయానికి ఇచ్చారు. ఇక్కడే తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించింది. నాటి నుంచి అశోక్ నగర్‌లోని అద్దె ఇంటిలోనే కొండా లక్ష్మణ్ బాపూజీ నివసించాడు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చివరి శ్వాస ఉన్నంత వరకు చిత్తశుద్ధితో కృషి చేసి, మూడు తరాల వారధి ఉన్న తెలంగాణ రాష్ట్ర అలు పెరుగని, అవిశ్రాంత పోరాట యోధుడు బాపూజీ తెలంగాణ ప్రజానీకానికి ప్రాతఃస్మరణీయుడు.

# 7 ఏళ్లుగా కాగితాలకే పరిమితమైన మహిళా బిల్లు

సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న బిల్లుల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఒకటి. గత 27 ఏళ్లుగా ఈ బిల్లు పెండింగ్‌లో ఉంది. మొదట దీనిని 1996లో పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టారు. ఆ బిల్లును రూపొందించినప్పుడు గీతా ముఖర్జీ నాయకత్వంలోని జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏడు సూచనలు చేసింది. ఆ తర్వాత 1998, 1999తో పాటు 2008, 2010లో పార్లమెంట్‌లోకి వచ్చింది కానీ చట్టంగా మారలేదు. 1996లో జాయింట్ పార్లమెంటరీ కమిటీ చేసిన ఏడు సూచనల్లో ఐదింటిని 2008 బిల్లులో చేర్చారు. వీటితో పాటు ఆంగ్లో ఇండియన్లకు 15 ఏళ్ల పాటు రిజర్వేషన్, సబ్ రిజర్వేషన్ కల్పించాలనే ప్రతిపాదన కూడా ఉంది. 1996 సెప్టెంబర్ 12న దేవేగౌడ ప్రభుత్వం తొలిసారిగా మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టింది. కానీ అది ఆమోదం పొందలేదు. ఈ బిల్లును 81వ రాజ్యాంగ సవరణ బిల్లుగా ప్రవేశపెట్టారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిల్లు ప్రతిపాదించింది. ఈ 33 శాతం రిజర్వేషన్‌లో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు ఉప-రిజర్వేషన్లు కల్పించే నిబంధన ఉంది. కానీ ఇతర వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించలేదు. ప్రతీ లోక్‌సభ ఎన్నికల తర్వాత రిజర్వ్‌డ్ స్థానాలను మార్చాలని బిల్లులో ప్రతిపాదించారు. రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతంలోని వివిధ నియోజకవర్గాలకు రొటేషన్ ద్వారా రిజర్వ్‌డ్ సీట్లను కేటాయించవచ్చని సూచించారు. ఈ సవరణ చట్టం అమలులోకి వచ్చిన 15 ఏళ్ల తర్వాత మహిళలకు సీట్ల రిజర్వేషన్ ముగుస్తుంది.

అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం 1998లో మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అయితే, ఎన్డీయే కూటమికి మద్దతిస్తున్న కొన్ని పార్టీలు బిల్లుని వ్యతిరేకించాయి. దీంతో బిల్లు ఆమోదం పొందలేకపోయింది. వాజ్‌పేయి ప్రభుత్వం 1999, 2002లతో పాటు 2003-2004లో కూడా మహిళా రిజర్వేషన్ బిల్లుని ఆమోదించడానికి ప్రయత్నించింది. కానీ, అవేవీ సఫలం కాలేదు. 2004లో కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రి అయ్యారు. యూపీఏ ప్రభుత్వం ఈ బిల్లును 2008లో 108వ రాజ్యాంగ సవరణ బిల్లుగా రాజ్యసభలో ప్రవేశపెట్టింది. మార్చి 9, 2010న రాజ్యసభ బిల్లుకు ఆమోదం తెలిపింది. ఈ బిల్లుకు బీజేపీ, వామపక్షాలు, జేడీయూ మద్దతు తెలిపాయి. యూపీఏ ప్రభుత్వం లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టలేదు. మహిళా రిజర్వేషన్ బిల్లుని సమాజ్‌వాదీ పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్ వ్యతిరేకించాయి. ఈ రెండు పార్టీలు యూపీఏలో భాగం కావడంతో లోక్‌సభలో బిల్లును ప్రవేశపెడితే తమ ప్రభుత్వం ప్రమాదంలో పడుతుందని కాంగ్రెస్ భయపడింది. 2008లో బిల్లుని స్టాండిగ్ కమిటీ ఆన్ లా అండ్ జస్టిస్ పరిశీలనకు పంపారు. అయితే ఈ సంఘంలో ఇద్దరు సభ్యులు వీరేంద్ర భాటియా, శైలేంద్ర కుమార్ సమాజ్ వాదీ పార్టీ నాయకులే. మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాకున్నప్పటికీ బిల్లును రూపొందించిన తీరుతో వారు ఏకీభవించలేదు. పార్టీలు అభ్యర్థుల ఎంపికలో 20 శాతం మహిళలకు టిక్కెట్లు ఇవ్వాలని, మహిళా రిజర్వేషన్ 20 శాతం దాటకూడదని వాళ్లిద్దరూ సిఫార్సు చేశారు. 2014లో లోక్‌సభ రద్దయిన తర్వాత ఈ బిల్లు ఆటోమేటిక్‌గా రద్దయింది. కానీ రాజ్యసభ శాశ్వత సభ కావడంతో అది ఇప్పటికీ సజీవంగానే ఉంది. అయితే, ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లుని చట్టంగా చేయాలంటే బిల్లుని మళ్లీ లోక్‌సభలో ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. లోక్‌సభ ఆమోదం పొందితే రాష్ట్రపతి సంతకంతో అది చట్టంగా మారుతుంది.

## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం




' ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో రేపటి నుండి ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.com కు పంపవచ్చు...

-ఎడిటర్

# కుందేలు శంక



వనపర్తి అడవిలోకి సాయంత్రం వేళ మర్కటం అనే కోతి "సాయం సంధ్య వేళయింది రారమ్మని నా ఇల్లు పిలుస్తోంది" అని పాడుకుంటూ వస్తోంది.అంతలో శేషం అనే కుందేలు ఏడుస్తూ కనబడింది చాలా ఆదుర్దాగ అనిపించి దగ్గరికి వెళ్లి మిత్రమా ఎందుకు ఏడుస్తున్నావ్ అని అడిగింది. మరకటాన్ని చూసిన శశమా అనే కుందేలు కౌగిలించుకుని బావురు మంది. శశమా తల నిమురుతూ ఏమైంది మిత్రమా అని అడిగింది. మిత్రమా మా పూర్వీకులు కొందరు చంద్రుడి పై నివసిస్తున్నారు కదా ఈ మానవులు ఇక్కడ మా జాతిని అంతరింప చేసిన అక్కడ ఉన్న మా జాతి సంతోషంగా ఉంటుంది అనుకునేదాన్ని, ఈ మానవులు చంద్రయాన్ బి3పేరిట చంద్రుడిపై కూడా మకాం పెట్టారంట ఇప్పుడే కాకి మిత్రుడు చెప్పాడు. ఈ స్వార్ధమానవులు అక్కడి మా వారిపై దాడి చేసి మా జాతిని అంతరింప చేస్తారని చాలా బాధగా ఉంది అంటూ కళ్ళొత్తుకుంది. మిత్రమా ఇన్ని రోజులు మానవులు చెప్పినట్లు మనం అనుకున్నట్లు చంద్రుడిపై ఎటువంటి మర్రిచెట్టు గాని కుందేలు గాని లేవంటా... పైగా అక్కడున్నదంతా సన్నని దుమ్మట నీటి జాడ కూడా కనపడలేదని నీటిజాడని కనిపెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నామని ఇస్రో శాస్త్రవేత్తలు టి.వి లో చెప్తుంటే విని వస్తున్నా..ఇదంతా చెట్టు పైన కూర్చొని వింటున్న పావురం ఈ మానవులు చాలా తెలివైన వారు..ఏదైనా కనిపెట్టగలరు..కాని అంతే స్వార్థపరులు వారి సౌఖ్యం కోసం వేటినైనా నాశనం చేసేస్తారు.వీరికి మేధస్సుతో పాటు కాస్త సహనం ,భూతదయ కూడా అలవడితే జీవనము మరింత అందంగా సాగించేవారు మనతో కలిసి అంది. అవునన్నట్లు శశమ తల ఊపింది. మిత్రమా శశమ ఇన్నాళ్ళు మానవులు ఊహించి చెప్పినది నిజమని నమ్మి సంతోషపడ్డాం. ఇప్పుడు వారి ఊహలు తప్పని వారి పరిశోదనలే ఋజువు చేశాయి.ఊరికే దిగు లు పడక సంతోషంగా ఉండటం నేర్చుకో!ఈ క్యారెట్ తిను అని అందించింది మర్కటం. హమ్మయ్యా! అయితే మా జాతికి ఏం ప్రమా దం లేదన్నమాట అంటూ క్యారెట్ అందు కుంది. మర్కటం,కాకి,పావురం సంతోషించాయి.

**సి.హేమలత**

**పుంగనూరు, 9666779103**

# కొంగ చేసిన మోసం..



పూర్వం ఒక అడవిలో స్వప్నిక అనే కొంగ ఉండేది. అది ముసలిది అయిపోవడం వల్ల ఇతర కొంగల లాగా వేటాడి ఆహారము సంపాదించడం కష్టం అయిపోయింది. అందుకు అది ఒక ఉపాయం ఆలోచించింది. బదరిక వనంలో కొల్లేరు అనే సరస్సు ఉంది. ఆ సరస్సునిండా చేపలు ఉన్నాయి అని తెలు సుకుంది. ఆ ముసలి కొంగ సరస్సు దగ్గరకు చేరుకుంది. సరస్సు ఒడ్డున ఒంటికాలితో జపం చేయడం మొదలు పెట్టింది.

ఆ సరస్సులోని చేపలు కొంగ చుట్టూరు వచ్చి చేరాయి. అయినా కొంగ చేపలను చంపి తినలేదు. అది చూసి చేపలు ఆశ్చర్యపోయి, కొంగా.!! నీకు మేము ఆహారం, పైగా నీకు అందుబాటులో కే వచ్చి నిలబడ్డాము, మమ్మల్ని తినవేంటి,? అని అమాయకంగా అడిగాయి. అప్పుడు ఆ కొంగ ఓ నా చేప మిత్రులారా! నేను గంగానది ఒడ్డున మర్రిచెట్టు మీద కూర్చుని ఉన్నాను, ఆ చెట్టు కింద ఒక యోగి తన శిష్యులతో ధర్మాలను చెప్తూ, సకల ప్రాణుల యందు దయతో ఉంటే గాని, మోక్షం లభించదు అని చెప్పారు.

అది విన్న నేను ఇకనుండి మీలాంటి జీవులను చంపి తినకూడదని నిర్ణయించుకున్నాను. అని చెప్పింది. చేపలు సంతోషించాయి. కొద్ది రోజులలోనే చేపలు, కొంగ మంచి మిత్రులు అయ్యాయి. ఒకరోజు ఉదయం చేపలు నీటి పైకి వచ్చేసరికి కొంగ ఏడుస్తూ కనబడింది. మిత్రమా! ఎందుకు ఏడుస్తున్నావ్ అని అడిగాయి.

చేపలు. ఏమి చెప్పను మిత్రులారా! ఇప్పుడే చేపలు పట్టేవాళ్ళు ఇక్కడికి వచ్చారు వాళ్లు ఈ సరస్సులో చాలా చేపలు ఉంటాయి త్వరలో వచ్చి ఈ చేపలను పడదాం అనుకోవడం విన్నాను అని చెప్పింది బాధగా, చేపలన్ని ఇప్పుడు ఎలా అని బాధపడసాగాయి. కొద్ది రోజులలోనే మనం మంచి మిత్రులు అయ్యాం కానీ త్వరలోనే మీరంతా చేపల వాళ్ళ వలలకి చిక్కుతారని తలచుకుంటేనే నా మనసుకి ఏదోలా అయిపోతుంది అని దొంగ కన్నీరు కార్చింది కొంగ. కొంగ మిత్రమా! ఈ ఆపద నుండి నువ్వే మాకు కాపాడాలి అని ఒక చేప అంది. అయ్యో! నేను ముసలి కొంగను, మిమ్మల్ని ఎలా రక్షిస్తాను, అయినా ప్రయత్నిస్తాను. ఇక్కడకు దగ్గరలో ఉన్న కొండలలో ఒక సరస్సు ఉంది ప్రతిరోజు మూడు చేపలు చొప్పున ఆ సరస్సు దగ్గరకు చేర్చుతాను అని చెప్పింది కొంగ మాటలకు చేపలు చాలా సంతోషించాయి.

అప్పటినుండి ఆ కొంగ ప్రతిరోజు చేపలను తన ముక్కుతో పట్టుకుని వెళ్తూ ఉండేది కొంతసేపటి తరువాత కాళీ నోటితో తిరిగి వచ్చి తీసుకెళ్లిన చేపలన్ని క్షేమంగా మరో సరస్సులో వదిలి వచ్చానని మిగతా చేపలకు చెప్పేది. ఇలా కొద్ది రోజులు గడిచిపోయింది. సరస్సులోని చేపలు సగం వరకు ఖాళీ అయిపోయాయి. అదే సరస్సులో చతురుడు అనే ఎండ్రకాయ ఉంది. దానికి కొంగ చేపలకి చేసినది మేలు కాదు కీడు అని అనుమానం వచ్చింది. ఆ విషయం చేపలకి చెప్పి, మరునాడు నేను కూడా కొంగతో వెళ్తాను అంది సరే అన్నాయి చేపలు.

కొంగ మిత్రమా! ఈరోజు నా వంతు నన్ను తీసుకెళ్ళు అంది. ఆహా! రోజు చేపలు తిని విసుగేసింది, ఈరోజు ఎండ్రకాయతో నాకు విందు భోజనము అనుకుంది కొంగ. అప్పుడు ఎండ్రకాయను నోటికి కరుచుకొని పోవాలనుకుంది, కొంగ మిత్రమా! నన్ను నీ ముక్కుతో పట్టుకుంటే నా కాళ్లు నీ కళ్ళలో గుచ్చుతాయి నీకే ప్రమాదం. అందుకని నీ మెడను నేను పట్టుకుని ఉంటాను అంది కొంగ సరే అంది. కొంత దూరము ప్రయాణం చేశాక ఎండ్రకాయ క్రింద చూస్తూనే ఉంది ఎక్కడ సరస్సు లేదు, ఇది కొంగ కాదు దొంగ దీనికి తగిన శాస్తి చేయాల్సిందే, అనుకుని కొంగ మెడను కొరికేసింది, కొంగ ప్రాణాలు వదిలి కిందకు పడిపోయింది. ఎండ్రకాయ కొంగ మెడ వదిలి సరస్సువైపు నడిచింది చేప మిత్రులని కలసి జరిగినది చెప్పింది చూశారా! మోసము ఎంత కాలం దాగదు 'తాడిని తన్నేవాడు ఒకడుంటే వాడి తలని తన్నేవాడు ఒకడుంటాడు"

అబద్దాలు చెప్పి చేపలను చంపి తిన్న కొంగ ఎండ్రకాయ చేతిలో చచ్చింది. అందుకు ఎవరిని మోసం చేయరాదు. అలా చేస్తే కొంగలా ఫలితం అనుభవించాల్సి వస్తుంది.

**బల్ల కృష్ణవేణి, పలాస**

# రిజర్వేషన్ల దోపిడీదారులకు కొమ్ముగాస్తున్న బిజెపి

## ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

**చిగురుమామిడి సెప్టెంబర్ 20 (ప్రజామంటలు):** ఈనెల 18 నుండి 22 వరకు జరుగుతున్న ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సాంబారి కొమురయ్య డిమాండ్ చేశారు. చిగురుమామిడి మండల కేంద్రములో ఆయన మాట్లాడుతూ.... రిజర్వేషన్ల దోపిడీదారులకు బిజెపి కొమ్ముగాస్తున్నదని అన్నారు. ప్రత్యేక పార్లమెంటు సమావేశంలో బిల్లు తీసుకురాకపోతే కేంద్రం మీద తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. మాదిగలను నమ్మించి మోసం చేయాలని చూస్తున్న కాంగ్రెస్ ఆటలు సాగవు అని, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు పార్లమెంటు ద్వారా చట్టబద్ధత కల్పించే ప్రక్రియను జాప్యం చేయడం ద్వారా రిజర్వేషన్లను గత 75 ఏళ్లుగా ఏకపక్షంగా దోచుకుంటున్న దోపిడిదారులకు బిజెపి కొమ్ముగాస్తుందని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సాంబారి కొమురయ్య ధ్వజమెత్తారు. 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపిన బిజెపి ప్రస్తుతం సంపూర్ణ మెజారిటీతో కేంద్రంలో అధికారంలో ఉండి కూడా ఎందుకు పార్లమెంటు బిల్లు పెట్టడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు నెలల క్రితం ప్రధానమంత్రి వరంగల్ లో స్వయంగా హామీ ఇచ్చిన నేటికి కార్యరూపం దాల్చకపోవడం బాధాకరమని అన్నారు. ప్రధానమంత్రి ఇచ్చిన మాటకే విలువ లేకపోతే ఈ దేశాన్ని పాలించే నైతిక అర్హత బిజెపికి లేదని అన్నారు. ఐదు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. రెండు రోజులపాటు హైదరాబాదులో ఉన్న అమిత్ షా ఎస్సీ వర్గీకరణ మీద మాట్లాడకుండా వెళ్లిపోవడం మాదిగల హృదయాలను తీవ్రంగా గాయపరిచిందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ నిర్లక్ష్యం చేయడం జరిగితే బిజెపి మీద మాదిగల



రాజకీయ తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు సిడబ్ల్యుసి లో ఎస్సీ వర్గీకరణ మీద తీర్మానం చేయకుండా కాంగ్రెస్ మరోసారి మాదిగల పట్ల వ్యతిరేకతను చాటుకుందని అన్నారు. కేవలం మాదిగల ఓట్ల కోసం ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ లో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని చేర్చారే తప్ప కాంగ్రెస్ నిజమైన చిత్తశుద్ధి లేదని అన్నారు మాదిగల ఓట్ల కోసం చేసే కపట రాజకీయాలు ఇకపై సాగవని అన్నారు. ఈ కార్యక్రమంలో చిగురుమామిడి బిఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బెజ్జంకి అంజయ్య, గడ్డం నాగరాజు, చిట్టెల కిష్టయ్య, గడ్డం అనిల్ కుమార్, మైలారపు చంద్రయ్య, జిల్లెల నాంపెల్లి, దర్శనం నల్లగొండ స్వామి, దర్శనం సారయ్య, గడ్డం శంకరయ్య, దర్శనం సంపత్, గడ్డం అంజయ్య, గడ్డం నిరంజన్, దర్శనం నరసింహా తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ బిల్లులు వెంటనే ప్రవేశపెట్టాలి



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 20 (ప్రజామంటలు):** ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని మాదిగ లాయర్స్ ఫెడరేషన్ (ఎం.ఎల్.ఏఫ్) కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గత 30 సం.లుగా ఎస్సీ వర్గీకరణ బిల్లు కోసం మాదిగలు పోరాటం చేస్తున్నారు. ఈ సందర్భంగా హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఛలో ఢిల్లీ ప్రోగ్రాంలో పాల్గొనేందుకు తరలి వెళ్లారు. ఈ బృందంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు కొంగర పూర్ణచందర్, ప్రధాన కార్యదర్శి పెండ్యాల అనిల్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు గోవిందా నాగభూషణం, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి మధుకర్ తదితర న్యాయవాదులు ఉన్నారు.

## గణేష్ మండపాలను దర్శించుకున్న ఎంఎల్సీ కౌశిక్ రెడ్డి



**జమ్మికుంట సెప్టెంబర్ 20 (ప్రజామంటలు):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధి లోని ధర్మారం, రామన్నపల్లి, కొత్తపల్లి, అన్ని స్థానిక వార్డులలో గణపతి మండపాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మండపానికి ఐదు వేల రూపాయలు చందా అందించిన కౌశిక్ రెడ్డి. ఈ కార్యక్రమంలో కౌశిక్ రెడ్డి తో పాటు జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు, వైస్ చైర్మన్ స్వప్న కోటి, స్థానిక కౌన్సిలర్లు, మండపాల కమిటీ సభ్యులు, బి.అర్.ఎస్. కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొగిలిపేట్ మల్లెంపంపు వాగు దగ్గర బస్సు ప్రమాదం




**మల్లాపూర్ సెప్టెంబర్ 20 (ప్రజామంటలు):** మల్లాపూర్ మండల్ మొగిలిపేట గ్రామంలో ని మల్లెం పంపు వాగు దగ్గర మెట్ పల్లి నుండి ఖానాపూర్ వైపు వెళ్తున్న బస్సు ఎదురుగా వస్తున్న బొలేరో ఆగిపోగా బస్సు లోయలోకి వెళ్లి మధ్యలో ఆగిపోయింది అని అక్కడ ఉన్న స్థానికులు చెప్పారు. బస్సు పైన విద్యుత్ తీగలు తగిన పెను ప్రమాదం తప్పింది. బస్సులో ఉన్న ప్యాసింజర్స్ చిన్నచిన్న గాయాలతో బయటపడ్డర్, డ్రైవర్ కండక్టర్ తో సహా పలువురు ప్రయాణికులు క్షతగాత్రులను 108 ద్వారా మెట్ పల్లి ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించడం జరిగింది.

## వాసవి మాత ఆలయంలో బొజ్జ గణపయ్య నవరత్రోత్సవములు..



**మెట్ పల్లి సెప్టెంబర్ 20 (ప్రజామంటలు):** పట్టణంలోని వినాయక నవరాత్రి ఉత్సవములో భాగంగా బొజ్జగణపయ్య ఉత్సవాన్ని బుధవారం ఆర్య వైశ్యులు అంగరంగ వైభవంగా ప్రారంభించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వినాయక నవరాత్రులలో భాగంగా వెండి వినాయకునికి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా వెండి వినాయకునికి దధ్నాభిషేకం, అన్నపూజ, అష్టోత్తరశత సువర్ణ పుష్పార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ. రాత్రి అయ్యప్పస్వామి భజన కార్యక్రమం మంత్ర పుష్పం, కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి మైలారపు లింబాద్రి, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు మైలారపు రాంబాబు శ్రీ వాసవి మాత చైతన్య నగర్ వాడకట్టు సంఘ అధ్యక్షులు బండారి సదాశివకుమార్ వాసవి మాత రెండవ వాడకట్టు సంఘం అధ్యక్షులు జిల్లా నవీన్, ఆమెటి సందీప్, చాడా చందు, దొంతుల లక్ష్మీ నారాయణ, పుల్లూరి శ్రీనివాస్ ,గంప శీను వెలగందుల జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



జగిత్యాల పట్టణానికి చెందిన 150 మంది ఆడబిడ్డలకు 1 కోటి 50 లక్షల 17 వేల రూపాయల విలువగల కళ్యాణ లక్ష్మి చెక్కులను జగిత్యాల పట్టణ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేసిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పట్టణ పార్టీ ఉప అధ్యక్షులు ఒల్లెం మల్లేశం, ధుమాల రాజ్ కుమార్, డిటి రాజేందర్ రావు, కౌన్సిలర్ లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 9వ వార్డులో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**జగిత్యాల సెప్టెంబర్ 20 (ప్రజామంటలు):** పట్టణ 9వ వార్డు అంతర్గం రోడ్డు లో 40 లక్షల నిధులతో లింగం చెరువు అవరణలో చేపట్టిన స్ట్రీట్ లైట్, ఫుట్ పాత్, ల్యాండ్ స్కేపింగ్, ఫుడ్ కోర్టు అభివృద్ధి పనులను ప్రారంభించి, పార్కులో మొక్కలు నాటిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, అదనపు కలెక్టర్ దివాకర. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ ఓద్ది శ్రీలత రామ్మోహన్ రావు, ఏఎంసి ఛైర్మెన్ నక్కల రాధ రవీందర్ రెడ్డి, ధరూర్ క్యాంపు రామాలయం చైర్మన్ నరేష్, సర్పంచ్‌లు నారాయణ, రాజమణి గంగాధర్, ఎంపిటిసి భూపెల్లి శ్రీనివాస్, ఉపసర్పంచ్ శేఖర్ రెడ్డి, డిఈ లు రాజేశ్వర్, రాజన్న, కమిషనర్ అనిల్, జిల్లా ఆర్టిఏ మెంబర్ సుధాకర్ రావు, కౌన్సిలర్‌లు, నాయకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**కోరుట్ల రూరల్ 20 (ప్రజామంటలు):** మండలంలోని మాదాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు బుధవారం నిర్వహించారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా చెత్త లేని భారతదేశం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ దారిశెట్టి రాజేశ్ తెలిపారు. కాగా ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ ఎల్లప్పుడూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అపరిశుభ్రంగా ఉంటే రోగాలు ప్రభలే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గంగుల నరేశం, గ్రామ పంచాయతీ కార్యదర్శి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బహరైన్‌లో ఘనంగా పద్మశాలీయుల వినాయక చవితి వేడుకలు



**కోరుట్ల సెప్టెంబర్ 20 (ప్రజామంటలు):** 'పద్మశాలి సమాజ్ బహరైన్' వారి ఆధ్వర్యంలో తేది 19 సెప్టెంబర్ 2023 మంగళవారం రోజున వినాయక చవితి వేడుకలు మహారాష్ట్ర కల్చరల్ హాల్ మనామలో అంగరంగ వైభవంగా జరిగాయి. బహరైన్ లో నివసిస్తున్న పద్మశాలీయులు అందరూ కుటుంబ సమేతంగా హాజరై వినాయకుని పూజ, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు పద్మశాలి సమాజ్ బహరైన్ గౌరవ అధ్యక్షులు అల్లే గంగాధర్ నేత, అధ్యక్షులు వేముల కృష్ణ నేత, ఉపాధ్యక్షులు శ్రీ గంగుల సుదర్శన్ నేత, ప్రధాన కార్యదర్శి యేముల సుధాకర్ నేత, సంయుక్త కార్యదర్శి బాలే శ్రీధర్ నేత, మీడియా సెక్రటరీ మెరుగు శ్రీనివాస్ నేత, సలహా కమిటీ సభ్యులు మాదాసు కృష్ణ హరి నేత, నందగిరి గంగాధర్ నేత, శ్రీ భోగ సత్యనారాయణ నేత, శ్రీ నాయిని మధుకర్ నేత, సభ్యత్వ కార్యదర్శి దీకొండ శ్యామ్ ప్రసాద్ నేత, సాంస్కృతిక కార్యదర్శి కాచర్ల వంశీ నేత, కార్యవర్గ సభ్యులు దొంతుల శంకర్ నేత, బాలె పరమేశ్వర్ నేత, జక్కుల కిరణ్ నేత మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## విద్యారంగం విశిష్ట సేవకు విద్యారత్న పురస్కారం

### పురస్కార గ్రహీత తంగళ్లపల్లి ధనలక్ష్మి



**కోరుట్ల సెప్టెంబర్ 20 (ప్రజామంటలు):** గత 50 సంవత్సరాలుగా విద్యా రంగంలో విశిష్ట సేవలు చేస్తూ ఎంతో మంది విద్యార్థుల భావి జీవితాలను తీర్చిదిద్దిన కోరుట్ల పట్టణ ప్రగతి హై స్కూల్ కరస్పాండెంట్ తంగళ్ల పల్లి ధనలక్ష్మి కి తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు వెలుగు సాహితి వేదిక స్వచ్ఛంద సేవా సంస్థ హైదరాబాద్ వారు తెలుగు, వెలుగు విశిష్ట విద్యా సేవా రత్న జాతీయ గౌరవ పురస్కారాన్ని త్యాగ రాజ గాన సభ హైదరాబాద్‌లో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... ఈ పురస్కారం రావడం చాలా సంతోషంగా ఉందని దీని వల్ల విద్యా రంగంలో ఇంకా భాద్యత పెరిగిందని దీనికి సహకరించిన అందరికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో అడ్వకెట్ కటుకం రాజేంద్ర ప్రసాద్ మరియు పాఠశాల ప్రిన్సిపాల్ తంగళ్ల పల్లి దీపక్ పాల్గొన్నారు.

## మహిళా బిల్లులో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ వాటా కల్పించాలి

### రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు, గీకురు రవీందర్



**చిగురుమామిడి సెప్టెంబర్ 20 (ప్రజామంటలు):** చట్ట సభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లపై మహిళా బిల్లులో ఎస్సీ , ఎస్టీ, ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ కోట కల్పించాలని మండల బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు మండల తహశీల్దార్ ద్వారా వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు గీకురు రవీందర్ మాట్లాడుతూ మహిళలకు 33% రిజర్వేషన్ మహిళా బిల్లు పార్లమెంట్ లో ప్రవేశపెట్టడం ఆహ్వానించదగినదేనని, కానీ మహిళా రిజర్వేషన్ లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ వాట కల్పించలన్నారు. మహిళా బిల్లు వల్ల బలహీన వర్గాలకు ఒరిగేదేమీ లేదన్నారు. మహిళా రిజర్వేషన్ పేరుతో పరోక్షంగా అగ్రవర్ణ మహిళలకే అధికారం కట్టబెట్టే కుట్రకు తెర తీస్తున్నారని ఆరోపించారు. ఈ బిల్లుతో పరోక్షంగా బహుజనులకు రాజ్యాధికారం దక్కకుండా అగ్ర వర్ణాల అధికారం ధార దత్తం చేయడమేనన్నారు. స్థానిక సంస్థల్లో మహిళా ప్రజా ప్రతినిధులకు బదులు వారి భర్తలే ఆధిపత్యం చెలాయిస్తున్నారు. అదే విధంగా చట్ట సభల్లో కూడా అగ్ర వర్ణాల పురుషాధిక్యతనే కొనసాగుతుందన్నారు. ఇప్పటికే కేంద్రములో పరిపాలన కొనసాగించిన కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు మండల్ కమీషన్ పక్కకు పెట్టాయన్నారు. మళ్లీ మహిళా బిల్లుతో ఎస్సీ ఎస్టీ బీసీ బహుజనలందరినీ రాజ్యాధికారానికి దూరం పెట్టే కుట్రేనని అన్నారు. బిజెపి ప్రభుత్వానికి మహిళా అభ్యున్నతి పట్ల చిత్తశుద్ధి ఉంటే మహిళా సాధికారత సాధించాలని సదుద్దేశం ఉంటే మహిళా బిల్లులో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓ బి సి కులాల మహిళలకు కూడా రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం నుండి తరఫున కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, మహిళ కమిటీ ప్రధాన కార్యదర్శి గందె శిరీష, జిల్లా నాయకులు బుర్ర శ్రీనివాస్, కంది నాగరాజు, పెనుకుల తిరుపతి, గందే రమేష్, బత్తిని సత్తయ్య గౌడ్, రాణా ప్రతాప్ సింగ్, ఎన్నం నీరజ్, అనువోజు రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఎం.ఎన్.కే. సెంట్రల్ కోర్టు సమస్యలపై స్పందించిన మంత్రి

### అధికారుల దృష్టికి అపార్ట్ మెంట్ సమస్యలు.. బీఆర్ఎస్ నేతల విజిట్



**సనత్ నగర్ సెప్టెంబర్ 20 (ప్రజామంటలు):** బన్సీలాల్పేట డివిజన్ బోయిగూడ లోని ఎం.ఎన్.కే విఠల్ సెంట్రల్ కోర్టు అపార్ట్ మెంట్ లో అధిక నీటి బిల్లులు, డ్రైనేజీ లీకింగులు తదితర సమస్యలపై రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్‌కు కంప్లైంట్ చేయగా, మంత్రి సానుకూలంగా స్పందించినట్లు అపార్ట్ మెంట్ కమిటీ ప్రెసిడెంట్ డాక్టర్. జి.హనుమాన్లు తెలిపారు. ఈమేరకు స్థానిక కార్పొరేటర్ హేమలత, పద్మారావునగర్ బీఆర్ఎస్ ఇంచార్జ్ గుర్రం పవన్ కుమార్ గౌడ్ లు బుధవారం సెంట్రల్ కోర్టు అపార్ట్ మెంట్ ను సందర్శించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అపార్ట్ మెంట్ లోని గణపతి ని దర్శించుకున్నారు. అపార్ట్ మెంట్ కనెక్షన్ కు చెందిన పనిచేయని నల్లా మీటర్ కు జలమండలి ఏకంగా రెండు లక్షల బిల్లును వేసినట్లు అపార్ట్ మెంట్ వాసులు మంత్రి దృష్టికి తీసుకెళ్ళగా, వెంటనే గుర్రం పవన్ కుమార్ గౌడ్ వాటర్ బోర్డు అధికారులతో మాట్లాడి, బిల్లు సమస్యను పరిష్కారించాలని సూచించారు. అలాగే అపార్ట్ మెంట్ ఆవరణలో గత కొన్నేండ్లుగా పార్కింగ్ చేసి ఉంచిన వాహనాలు దుమ్ము పేరుకుపోయి ఉన్నాయని తెలపగా, వీటి విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసి, వాహనాలను వారికి అప్పగించాలని పేర్కొన్నారు. బోయిగూడ వై జంక్షన్ నుంచి పాత గాంధీ ఆసుపత్రికి వెళ్ళే రోడ్డుపై నిత్యం డ్రైనేజీ పొంగుతుందన్నారు. వెంటనే అధికారులతో గుర్రంపవన్ కుమార్ గౌడ్ ఫోన్ లో మాట్లాడారు. కార్యక్రమంలో అపార్ట్ మెంట్ ప్రెసిడెంట్ డా. జి. హనుమాన్లు, సమన్వయకర్త వెంకటేశ్వర రావు, ఉపాధ్యక్షులు కే.మోహన్ దాస్, కాళిదాసు, సేతు మాధవరావు, సుధీర్ బాబు, అపార్ట్ మెంట్ వాసులు పాల్గొన్నారు. అపార్ట్ మెంట్లోని దీర్ఘకాలిక సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి, వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశించిన మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ కు, సహకరించిన బీఆర్ఎస్ ఇంచార్జ్ గుర్రం పవన్ కుమార్ గౌడ్, కార్పొరేటర్ హేమలత లకు సెంట్రల్ కోర్టు వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

# వైభవంగా రుషి పంచమి వేడుకలు

(రామ కిష్టయ్య సంగన భట్ల)





ధర్మపురి సెప్టెంబర్ 20 (ప్రజామంటలు): యుగ యుగాలుగా, తర తరాలుగా అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తున్న క్షీరధార హైందవ సంస్కృతి. ఆ పాల వెల్లువలో పెల్లుబికిన మీగడ తరగలే అనాదిగా ఆచరించ బడుతున్న సత్సాంప్రదాయాలు. హైందవ సంస్కృతీ సంప్రదాయాలకు, ఆచారాలకు ఆధ్యాత్మిక చింతనకు కేంద్ర బిందులైన ఉత్సవాలు, పండగలు, వేడుకలు, నోములు, వ్రతాలు, పూజలు, పునస్కారాలు పెక్కు విధాలు, పురాణేతిహాస, రుతుపరమైన, మతప్రమేయమైన, శీతోష్ణస్థితి, సామాజిక జీన విధానం, కుటుంబ వ్యవస్థీకృత, వైయక్తిక పారమార్థిక, స్థానిక పరిస్థితుల నేపథ్యం కలిగినవి ప్రధానమైనవి. లోక సంక్షేమార్థులైన పూర్వ రుషులు నక్షత్ర గమనాన్ని బట్టి, రుతు ధర్మాన్ని బట్టి చేయాల్సిన కార్యక్రమాలను ఏర్పరచారు. వ్రతాలు, నియమాలు ఒక సంస్కారాన్ని అలవరచడానికి దోహద పడతాయి. అలాంటి వ్రతాలలో ఆడవాళ్ళ మాత్రమే ఆచరించే కొన్ని ప్రత్యేక వ్రతాలున్నాయి. అలాంటి వాటిల్లో ప్రధానమైనది రుషి పంచమి. రజస్వలగా ఉండి అజ్ఞాతంగా చేసే తప్పులను అన్నింటినీ పోకార్చే, దోష నివారణార్థం ఆచరించే వ్రతం ఇది. భవిష్యోత్తర పురాణంలో నిర్దేశిత భాద్రపద శుక్ల పంచమి నాడు ఆచరించే ఈవ్రతాన్ని శ్రీకృష్ణ భగవానుడు ధర్మరాజుకు వివరించిన ప్రకారం ఇంద్రునికి బ్రహ్మ హత్యా పాతకం తగలగా, అందులో కొంతభాగం స్త్రీలు కూడా గ్రహించడం జరిగిందని, వారిలో రజో ధర్మం అందుకే కలిగిందనీ, ఆకాలంలో తెలియక చేసే పాపాలు తొలగించడానికే ఈ వ్రతం ఉద్దేశించబడిందని పేర్కొన బడింది. ఇది ప్రాయశ్చిత్తాత్మక వ్రతంగా అనాదిగా ఆచరించ బడుతున్నది. పౌరాణికులు, వేదవిదులు, శాస్త్ర పండితులు సంకల్పం చెబుతుండగా స్నానం ఆచరించి, ఉత్తరేణి చెట్టుకు పూజాదులు చేసి, ఉత్తరేణి పుల్లలతో, కాడలతో దంత దావనం చేసుకుని, ముఖం కడుక్కుని, ఉత్తరేణి ఆకులు నూనె రాసుకుని, అభ్యంగన స్నానం చేసి, పసుపు, కుంకుమ ధరించి, వితంతువులైతే భస్మాన్ని ధరించి, ధవళ వస్త్రాలతో, నూతన వస్త్రాలంకృతులై అరుంధతీ సహిత సప్త రుషులను పూజిస్తారు. పూజ జరిగేంత వరకు నాలుగు వత్తుల దీపాన్ని వెలిగిస్తూ ఉంటారు. ఆర్ష విజ్ఞానానికి, ప్రాచీన సంప్రదాయాలకు అనాదిగా నిలయమైన ధర్మపురి క్షేత్రంలో, ఋుషి పంచమి సందర్భంగా గురువారం గోదావరి నది స్నానాలు ఆచరించి, మహిళలు వైయక్తికంగా, సామూహికంగా వ్రతాలను ఆచరించారు.

## మహిళా బిల్లును తక్షణమే అమలు అయ్యేలా చూడాలి

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు టి. విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి



జగిత్యాల సెప్టెంబర్ 20 (ప్రజామంటలు): కేంద్రం ప్రవేశ పెట్టిన మహిళా బిల్లు స్వాగతించే అంశం అయినప్పటికీ, దాని అమలుపై కేంద్రానికి చిత్తశుద్ధి లేకపోవడం విచారకరమణి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల లోపే మహిళా బిల్లు అమలులోకి వచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మంగళవారం పార్లమెంట్ లో ప్రవేశ పెట్టిన బిల్లు 2026 తర్వాత అమలుకు నోచుకోనుందనే విషయం స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. మహిళా బిల్లుపై ఆశలు కల్పించి, ఆచరణలో మొండి చెయ్యి చూపడం మోదీ ప్రభుత్వం కు ఎంతమాత్రం మంచిది కాదన్నారు. షెడ్యూల్ ప్రకారం 2021 లో జరగాలసిన జనగణన కరోనా కారణంతో జరగలేదని, డిజిటల్ పద్ధతిలో చేస్తామన్నా అది కార్యరూపం దాల్చలేదన్నారు. అంటే తిరిగి పదేళ్ల వరకు జనాభా లెక్కల ఊసే లేదని స్పష్టం అవుతుందనే విషయాన్ని గమనంలోకి తీసుకోవాలన్నారు. జన గణన పూర్తి అయితేనే, ఆ జనాభా ఆధారంగా డి లిమిటెషన్ పూర్తయి, మహిళా రిజర్వేషన్ ఖరారు అయ్యే అవకాశం ఉందనే అంశం మహిళా బిల్లు ప్రవేశ పెట్టిన తీరు ద్వారా స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. పై అంశాలని బట్టి మరో పదేళ్ల వరకు మహిళా బిల్ అమలు ఆస్కారం లేదని, ఎన్నికల సమయంలో మహిళబిల్లు తెరపైకి తేవడం బిజెపి, బీఅర్ఎస్ ఆడిన ఒక మైండ్ గేమ్ అని ఆరోపించారు. గతంలోనే యూపీఏ ప్రభుత్వం హయాంలో 33% రిజర్వేషన్ స్థానిక సంస్థల్లో అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ, యూపీఏ ప్రభుత్వం కే దక్కిందాన్నారు. కేంద్రం ఉన్న ఫలంగా మహిళా బిల్లు ప్రవేశ పెట్టడం అంటే అది యూపీఏ, దాని మిత్ర పక్షాల విజయమని అన్నారు. నిజంగా కేంద్రానికి మహిళా బిల్లు అమలుపై చిత్తశుద్ధి ఉంటే తక్షమే అమలు చేసి, అందులో బిసి, ఎస్సి, ఎస్టీ, మైనారిటీ మహిళల స్పష్టమైన వాటా తెల్చాలని విజయలక్ష్మి డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో బిల్లు తెరపైకి తేవడం రాజకీయ వ్యూహం అని, అయినప్పటికీ అన్నీ పార్టీలు సహకరించిన పదేళ్ల వరకు బిల్లు అమలుకు మోక్షం లేకపోవడం బీజేపీ మహిళా లోకానికి చేస్తున్న పెద్ద మోసం, ద్రోహమని అన్నారు.

## రాష్ట్రంలో పెంచిన 10% గిరిజన రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చాలి

రాష్ట్ర గిరిజన సంఘం ఉపాధ్యక్షుడు భీమా సాహెబ్



హుస్నాబాద్ సెప్టెంబర్ 20 (ప్రజామంటలు): తమిళనాడు రాష్ట్రంలోని నమక్కల్ జిల్లా కేంద్రంలో ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మంచ్ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి గిరిజన మహాసభలో తెలంగాణ రాష్ట్ర ప్రతినిధుల పక్షాన తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమా సాహెబ్ పాల్గొని మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో పెంచిన 10% గిరిజన రిజర్వేషన్ల ను రాజ్యాంగంలోని 9 వ షెడ్యూల్లో తక్షణమే చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఇప్పుడు జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో దీనిపై తీర్మానం చేయాలని కోరారు. అందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో తక్షణమే గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్ రాష్ట్రంలో గిరిజనులపై జరుగుతున్న హింసను తక్షణమే అరికట్టాలని, దేశవ్యాప్తంగా గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. ప్రత్యేక గిరిజన చట్టాలను హక్కులను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. దేశవ్యాప్తంగా ఉన్న ఆదివాసి గిరిజనులు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## స్పోర్ట్స్ స్కూల్ కు ఎంపికైన విద్యార్థిని అభినందించిన జమ్మికుంట సిఐ రమేష్



జమ్మికుంట సెప్టెంబర్ 20 (ప్రజామంటలు): క్రీడా ప్రతిభ ద్వారా 4వ తరగతిలో సీటు సాధించిన చిన్నారి దూడపాక శ్రీవర్షిణి ని పుష్పగుచ్చంతో అందజేసి అభినందించి దీవించారు. కరీంనగర్ జిల్లా నుండి సీటు సాధించిన ఇద్దరిలో జమ్మికుంట ప్రాంతానికి చెందిన శ్రీవర్షిణి కావటం మన ప్రాంతానికి గర్వకారణమని ప్రశంసించారు, రానున్న రోజుల్లో దేశం గర్వపడేలా క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకుని విజయాలు సాధించాలని కోరారు. సందర్భంగా జాతీయ క్రీడాకారులు అంబాల ప్రభాకర్ (ప్రభు) మాట్లాడుతూ.... తల్లిదండ్రులు వారి పిల్లలకు చిన్నతనం నుండే సెల్ ఫోన్స్, టివి లకు అలవాటై వ్యసనంగా మారుతున్న తరుణంలో శ్రీ వర్షిణి లాగా బాల్యం నుండే క్రీడల్లో మక్కువ పెంచుకొని శరీర దారుఢ్యం, ఆరోగ్యం అలవర్చుకోవాలనీ సూచించారు. పిల్లలు ప్రతి ఒక్కరూ శారీరక శ్రమతో కూడిన ఆటలు ఆడటం అలవర్చిలుకోవాని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి స్కూల్ యాజమాన్యం మల్లేశం, రాజశేఖర్, విద్యార్థిని తండ్రి దూడపాక శ్రీనివాస్ లు ఉన్నారు.

## రుతు చక్రంపై విద్యార్థినులకు లయన్స్ క్లబ్ అవేర్నెస్

గర్ల్ స్టూడెంట్స్కు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ



సనత్ నగర్ సెప్టెంబర్ 20 (ప్రజామంటలు): రుతుచక్ర పరిశుభ్రం, హెల్త్, హైజీన్ అంశాలపై హైదరాబాద్ లయన్స్ క్లబ్ యువ మెంబర్, డిప్లోమేటిక్ మిషన్ ఉద్యోగి విజయేత తిర్కే కటారియా బుధవారం బేగంపేట లోని శ్రీ సంతోషిమాత హైస్కూల్ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం 9, 10 వ తరగతి క్లాస్ గర్ల్ స్టూడెంట్స్ కు శానిటరీ ప్యాడ్స్ ను ఉచితంగా అందచేశారు. ఆమె మాట్లాడుతూ.. భారత దేశంలో కోట్లాది మంది మహిళలు, బాలికలు మెనుస్ట్రల్ హెల్త్, హైజీన్ విషయాల్లో అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. లయన్స్ క్లబ్ హైదరాబాద్ యువ రుతు చక్ర పేరున బాలికల్లో హైజినిక్, రుతు చక్రం, ఇన్ఫెక్షన్స్ రాకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## వారాసిగూడ గణేషుడి వద్ద అన్నదానం

హాజరైన నాగులూరి సాయిబాబా



సికింద్రాబాద్ సెప్టెంబర్ 20 (ప్రజామంటలు): సికింద్రాబాద్ నియోజకవర్గంలోని వారాసిగూడలో కాంగ్రెస్ నేత సందీప్ రాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బుధవారం భక్తజనులకు స్వామి వారి మహా ప్రసాదం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాగులూరి సాయిబాబా, నోముల ప్రకాశ్ గౌడ్ లు అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించి, వందలాది మంది భక్తులకు భోజనం వడ్డించారు. వినాయక నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న ఆర్గనైజర్లను అభినందించారు. కార్యక్రమంలో అడ్డగుట్ట డివిజన్ పార్టీ ప్రెసిడెంట్ గంటరాజు సాగర్, నాయకులు సతీష్, ప్రమోద్, అంజి, దేవుడు, వెంకట్, ఆంజనేయులు, బాబు, జుట్టు, శంకర్, బాబా తదితరులు పాల్గొన్నారు.

## దేశభక్తికి ప్రతీక "మేరా దేశ్ - మేరా మట్టి"



బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి

గొల్లపల్లి సెప్టెంబర్ 20 (ప్రజామంటలు): గొల్లపల్లి మండలంలో మల్లన్నపేట గ్రామంలో 'నా దేశం – నా మట్టి' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి కార్యక్రమ అనంతరం మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం సిద్దించి డెబ్బై అయిదు సంవత్సరాలు పూర్తయినా సందర్బంగా కేంద్ర ప్రభుత్వం సాంస్కృతిక శాఖ ప్రతిష్టాత్మాకంగా చెప్పట్టిన ఆజాధికా అమృత్ మహోత్సవాలలో భాగంగా మేరా దేశ్ మేరా మాటి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఇది ప్రతిఒక్కరి దేశభక్తికి నిదర్శనం అని ఇది పార్టీ కార్యక్రమం కాదని దేశంలోని ప్రతిఒక్కరిలో దేశభక్తిని పెంపొందించడం కోసం చేపట్టిన అధికారిక కార్యక్రమం అని తెలంగాణాలో బిఆరెస్ ప్రభుత్వం సహకరించకపోవడం వల్ల పార్టీలకతీతంగా విద్యార్థులతో జాతీయవాదులతో దేశభక్తులతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో ప్రవహిస్తున్న దేశంలోని రెండవ అతిపెద్ద నది అయిన మండలంలోని ప్రతి గ్రామం నుండి సేకరించిన మట్టిలో నుండి కొంత మట్టిని ఒక కలశంలో తీసుకొని ప్రతి మండలానికి ఒక ప్రతినిధి చొప్పున ఇట్టి కళశాన్ని ఢిల్లీకి తీసుకుపోవడం జరుగుతుందని అన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన దేశభక్తుల స్మృత్యర్థం దేశవ్యాప్తంగా సేకరించిన మట్టితో స్మృతి వనాన్ని నిర్మించి జాతీయవాదుల, దేశభక్తుల స్ఫూర్తిని రానున్న తరాలకు అందించడం కోసం కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మాకంగా చేపట్టిన కార్యక్రమం అని ఇందులో విద్యార్థులు, యువజన సంఘాలు, కుల సంఘాలు, జాతీయవాదులు, దేశభక్తులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసి దేశసేవలో పాల్గొనాలని అన్నారు ఈ కార్యక్రమంలో దర్మపురి అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం మండల అధ్యక్షుడు కట్ట మహేష్ జిల్లా ఉపధ్యక్షుడు గాజుల మల్లేశం అసెంబ్లీ కో కన్వీనర్ బండారి లక్ష్మణ్ దళిత మో ర్చ రాష్ట్ర కార్యదర్శి ఒరగంటి చెంద్రశేఖర్ అధికార ప్రతినిధి కాడే సూర్య నారాయణ జిల్లా కార్యవర్గ సభ్యులు పాదం మహేష్ పటేల్ మహిళ మార్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతకింది అనసుర్య పెగడపల్లి మండలం అధ్యక్షుడు కోమురెల్లి, గొల్లపల్లి మండల ప్రధాన కార్యదర్శి గుడ్ల కృష్ణ రాజు, బిజేవైఎం మండల అధ్యక్షుడు లక్కాకుల వెంకటేష్, బిజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ కోక్కు లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షులు కొంద్ర మల్లారెడ్డి, భీమా మహేష్, గోలి రమేష్, వనపర్తి రాజేందర్, మండల కార్యదర్శి అనసురి చరణ్, గుర్రం రంజిత్ రెడ్డి ఐటీ సెల్ కో కన్వనర్ గాజుల సిద్దు, స్థానిక నాయకులు మోరపల్లి బాలయ్య, బూత్ అధ్యక్షులు బండారి నరేష్, సిద్దెంకి గంగన్న, ప్రేమ్ శివాజీ, బిజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి లక్కాకుల రవి, బొంగోని దామోదర్ పాల్గొన్నారు.

## వైశ్య భవన్ గణేశునికి సహస్ర పుష్పార్చన

జగిత్యాల సెప్టెంబర్ 20 (ప్రజామంటలు): జిల్లా కేంద్రంలోని వైశ్య భవన్ లో గణేష్ మండపం వద్ద బుధవారం సహస్ర పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు స్వహస్తాలతో వివిధ రకాల పుష్పాలతో అర్చన కొనసాగించారు. వైదిక క్రతువులు ఆలయ ప్రధాన అర్చకులు సిరిసిల్ల భాస్కర్ శర్మ విచ్చేసిన భక్తులతో గోత్రనామాలతో సంకల్పం చేయించి కలశ, గణపతి, గౌరీ పూజలు చేయించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాద వితరణతో పాటు ఆశీర్వచనం చేశారు. మహిళా భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని పుష్పార్చన గావించారు. స్వామివారి నామస్మరణతో మంటపం అంతా మారుమోగింది. కార్యక్రమంలో సహాయ అర్చకులు శ్రీధర వెంకటరమణ, భక్తులు పాల్గొన్నారు.



## మహిళా బిల్లులో ఓబీసీల స్థానం ఎక్కడ?!

బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గం కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్



హుస్నాబాద్ సెప్టెంబర్ 20 (ప్రజామంటలు): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలము లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహిళా బిల్లు లో ఓబీసీల స్థానం ఎక్కడ అని ఒకదిక్కు బీసీలు దేశంలో సగం ఉన్నారని కాబట్టి 50% రిజర్వేషన్లు విద్యా రాజకీయ ఉద్యోగ రంగాలలో ఇవ్వాలని కొట్లాడుతూ ఉంటే, మహిళా బిల్లులో ఓ బీసీల ప్రస్తావన లేకపోవడం ఏమిటి. మోడీ ప్రభుత్వం బీసీల పట్ల పూర్తి వ్యతిరేకత తో పనిచేస్తుంది. బిజెపి పార్టీలో ఉన్న బీసీలు మోదీ, అమిత్ షా అనుసరిస్తున్న వైఖరిని వ్యతిరేకించాలి. కుల గణన చేపట్టమని సుప్రీంకోర్టు చెప్పిన చేయకుండా ఐదు సంవత్సరాల తర్వాత ఈ మహిళా బిల్లు చట్ట రూపం దాల్చుకుంటుంది అని చెప్పడం విడ్డూరంగా ఉంది అని, కులగనన చేసి ఓబీసీల లెక్క తేల్చి, బీసీ మహిళలకు కూడా తగిన రిజర్వేషన్ కల్పించాలని ఈ మహిళా బిల్లు పూర్తిగా దొరల బిల్లుగా మారిపోయింది అని మహిళా రిజర్వేషన్ బిల్లు, ఓబీసీల ప్రస్తావన లేకుండా అగ్రవర్ణాల ఒత్తిడికి భయపడి బిజెపి ప్రభుత్వం మహిళా ఓటు బ్యాంకు కొరకు కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని గతంలో చట్టసభలలో 27 శాతం రిజర్వేషన్లు బీసీలకు కల్పించాలని చట్ట సభలలో చట్టం చేయడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూదరి రవీందర్, లక్ష్మణ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## చేప పిల్లల పంపిణీ చేసిన ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు



ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 20 (ప్రజామంటలు): మండలంలోని అన్ని గ్రామాల గంగపుత్రులకు ఎమ్మెల్యే చేతుల మీద చేప పిల్లలు పంపిణీ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీజేపీల నుండి బిఆర్ఎస్ పార్టీ లోకి చేరికలు



**రాయికల్ సెప్టెంబర్ 20 (ప్రజామంటలు):** రాయికల్ మండల చింతలూరు గ్రామానికి చెందిన 25 మంది యువకులు సర్పంచ్ శ్రీనివాస్ గారి అధ్వర్యంలో బిజెపి కాంగ్రెస్ పార్టీల నుండి బిఆర్ఎస్ పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరగా బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సంధ్యారాణి సురేందర్ నాయక్, జడ్పిటిసి అశ్విని జాదవ్, మున్సిపల్ ఛైర్మెన్ మోర హనుమండ్లు, మండల పార్టీ అధ్యక్షులు కోల శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ రాణి సాయికుమార్, పిఏసిఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ మహేశ్వర రావు, జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు నాగరాజు, మండల పార్టీ ఉపాధ్యక్షులు మర్రిపల్లి శ్రీనివాస్ గౌడ్, మండల కో ఆప్షన్ సభ్యులు ముఖీద్, మండల యూత్ అధ్యక్షులు వెంకటేష్, గ్రామ శాఖ అధ్యక్షులు నారాయణ, ఉపాధ్యక్షులు ఆల్లెపు నరసయ్య, కడ రాజేందర్, కండ్లపల్లి నరసయ్య, సర్పంచ్లు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటలపోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే, జెడ్పి చైర్ పర్సన్





**జగిత్యాల సెప్టెంబర్ 20 (ప్రజామంటలు):** పట్టణ వివేకానంద మిని స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జి ఎఫ్) వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి అండర్ 14, 17 ఆటల పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు పరేడ్ నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ క్రీడాకారులను పరిచయం చేసుకొని వారి నుండి గౌరవ వందనం స్వీకరించారు. క్రీడలు ఈనెల 23 వరకు కొనసాగును. ఈనెల 25, 26 తేదీలలో అథ్లెట్స్ పోటీలు నిర్వహించబడును. ప్రారంభోత్సవ కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, ఇంఛార్జి మున్సిపల్ ఛైర్మెన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ చుక్కనవీన్, డీఈవో జగన్ మోహన్ రెడ్డి, ఎస్ జిఎఫ్ సెక్రటరీ లక్ష్మి రామ్ నాయక్, డివైఎస్ఓ డా. రవికుమార్, పి.ఈ.టీ. లు భాస్కర్ రెడ్డి, విశ్వప్రసాద్, గంగాధర్, భూమేష్, జమున, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## నిన్న ఇచ్చిన మాట.. నేడు పడిన బాట...



**గొల్లపల్లి సెప్టెంబర్ 20 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండల కేంద్రంలోనిన్న ప్రజా ఆశీర్వాద యాత్రలో పాల్గొన్న మంత్రి కొప్పుల ఈశ్వర్ ని గొల్లపల్లి నల్లగుట్ట వడ్డెర కాలనివాసులు మాకు సీసీ రోడ్డు కావాలని అడగా వెంటనే మాట ఇచ్చి స్థానిక వైస్ ఎంపీపీ ఆవుల సత్యం కు ఇది వెంటనే రోడ్డు వెయ్యాలి అని చెప్పారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు బుధవారం సీసీ రోడ్డు వేశారు. వెంటనే సీసీ రోడ్డు వేయించిన మంత్రి కొప్పుల ఈశ్వర్ కు, వైస్ ఎంపీపీ ఆవుల సత్యం కు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు.



(ఫోటో రైటప్ వార్త )

జగిత్యాల నియోజకవర్గ దివ్యాంగులకు ఉచిత బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిల్ లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, మున్సిపల్ ఛైర్మెన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ చుక్క నవీన్, పాల్గొన్న డిడబల్యూఓ నరేష్, అధికారులు, తదితరులు.



జనగామ జిల్లా గుండ్లగడ్డ కాలనీలో బుధవారం గణపతికి ప్రత్యేక పూజలు

# పెట్రోల్ పంపుల ఆకస్మిక తనిఖీలు

### ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫిల్లింగ్ స్టేషన్లు నిర్వహించాలి

**జనగామ సెప్టెంబర్ 20 (ప్రజామంటలు):** జనగామ జిల్లా వ్యాప్తంగా వివిధ పెట్రోల్ పంపు లలో రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ వి. అనిల్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ ల సూచనల మేరకు జాయింట్ టీం కమిటీ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రభుత్వ నిబంధనల ప్రకారం (ఫిల్లింగ్ స్టేషన్) పెట్రోల్ పంపులలో త్రాగునీరు, టాయిలెట్స్, ఫైర్ సేఫ్టీ, సేల్స్ తదితర అంశాలపై వారు సాయినాథ్ సర్వీసింగ్ స్టేషన్, శ్రీ ఆనంద సర్వీస్ స్టేషన్, పాలకుర్తి, సేవాలాల్ ఫిల్లింగ్ స్టేషన్, కామారెడ్డి గూడెం, గోదావరి ఫిల్లింగ్ స్టేషన్ గొల్లపల్లి, శ్రీలత ఫిల్లింగ్ స్టేషన్ చెన్నూరు, శ్రీ రాజమ్మ ఫీలింగ్ స్టేషన్, చాముండేశ్వరి ఫీలింగ్ స్టేషన్, శ్రీ సాయి మల్లీ ఫిల్లింగ్ స్టేషన్, జనగామ, శ్రీ సాయి వికాస్ ఫీలింగ్ స్టేషన్ పెంబర్తి, లలో తనిఖీలు చేశారు. ఎలాంటి కల్తీ లేని పెట్రోల్, డీజిల్ లను మాత్రమే విక్రయించాలన్నారు. పెట్రోల్ పంపులలో ఐదు లీటర్ల ప్రామాణిక కొలత పాత్ర ద్వారా పెట్రోలు డీజిల్ స్వయంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పెట్రోల్ పంపులు నిర్వహించాలని, లేనియెడల చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో జాయింట్ టీం కమిటీ సభ్యులు డిఎస్ఓ



ఎం.రోజా రాణి, లీగల్ మెట్రాలజీ అధికారి శ్రీనివాస్, ఐఓసి సేల్స్ అధికారి పృధ్విరాజ్, సంబంధిత డిప్యూటీ తాసిల్దార్స్ శ్రీనివాస్, దేవా తదితరులు ఉన్నారు.

## వి.హెచ్.పి. ఆధ్వర్యంలో ఋషి పంచమి వేడుకలు



**జనగామ సెప్టెంబర్ 20 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీ, మూలబావి వినాయక నవరాత్రి మండపం వద్ద విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఋషి పంచమి వేడుకలు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ నగర అధ్యక్షులు) గునిగంటి రామకృష్ణ, జిల్లా కార్యదర్శి బచ్చు బాలనారాయణ సప్త ఋషుల చిత్ర పటాలకు పూలు సమర్పించి ఆరాధించారు. ఈ వేడుకల్లో ప్రముఖ పండితులు, జ్యోతిష్య మహర్షి డాక్టర్ మోహనకృష్ణ భార్గవ పాల్గొని మాట్లాడుతూ.... మనిషి జన్మతః ఋషి ఋణము, దైవ ఋణము, పితృ ఋణాలకు బద్ధుడై ఉంటాడని, బ్రహ్మ సమానులైన సప్త ఋషులు విశ్వ సృష్టిలో కీలక పాత్ర పోషించడమే కాకుండా మానవాళికి నాగరిక, సంస్కృతీ సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, వేదాలు, పురాణాలు, స్మృతి ధర్మశాస్త్రాలు బోధించి ధర్మ మార్గంలో నడిచేందుకు సన్మార్గాన్ని బోధించారని వారిని స్మరించుకోవడానికి ఋషి పంచమి రోజున వారి ఆరాధన జరుపుతారని తెలియజేశారు. గునిగంటి రామకృష్ణ మాట్లాడుతూ.... ఋషులను సదా స్మరించడం, వారు చూపిన ధర్మమార్గంలో నడవడం మనందరి బాధ్యత అన్నారు. బచ్చు బాల నారాయణ మాట్లాడుతూ.... సకల విశ్వశ్రేయస్సు, సకల ప్రాణిహితం, లోకశాంతి కోరుకుంటూ ధర్మాచరణ, కర్మాచరణతో ఋషి ఋణాన్ని తీర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు శ్రీనివాస్, గుజ్జుల కుమారస్వామి, నమిలే శంకర్, సీతారామచంద్రస్వామి దేవస్థాన కమిటీ సభ్యులు కందాడి యాదగిరి, యెలసాని కృష్ణమూర్తి, రాంబాబు, కుర్రెముల సత్యనారాయణ, కందాడి సంజీవ్ రెడ్డి, కళ్లెం నాగరాజు, మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా బోనాలు తీసిన పద్మశాలీలు



**జనగామ సెప్టెంబర్ 20 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కేంద్రంలో పద్మశాలి కులస్తులు బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. దశాబ్దాలుగా ప్రతి సంవత్సరం సంప్రదాయ పద్ధతిగా వినాయక చవితి పండగ తర్వాత నిర్వహించే పద్మశాలీ కులస్తులు అందరు ఇంటింటికీ బోనం ఎత్తుకుని పోచమ్మ తల్లులకు మొక్కులు సమర్పించారు. ఆనవాయితీగా వస్తున్న బోనాల పండుగను అందరు ఐక్యమత్యంగా నిర్వహించారు. పోచమ్మ తల్లికి మొక్కులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జనగామ పొపా సహాయ కార్యదర్శి మదాసు ఎల్లయ్య,జనగామ పొపా అధికార ప్రతినిధి పిట్టల సతీష్, చింతకింది హరి, దూడక నవీన్, గడ్డం రమేష్, ప్రభాకర్ సార్, బూరెల వెంకటేష్, పిట్టల రవీందర్, గర్ధస్ సంతోష్, అమంచ రమేష్, లోక విఠల్, బూరెల సంతోష్, మదాసు శ్రీకాంత్, మదాసు రాజు, అందే సోమనర్సయ్య అందే సంపత్ బూరెల సమంత్ చింతకింది నవీన్, గుండా శ్రీనివాస్, దూడక ఆంజనేయులు, మండల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## నెల్లుట్ల గ్రామంలో ఎం.ఎస్.పి, ఎం.ఆర్.పి.ఎస్. ఆధ్వర్యంలో జాతీయ రహదారుల దిగ్బంధం

**జనగామ సెప్టెంబర్ 20 (ప్రజామంటలు):** ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాలలో ఎస్సి వర్గీకరణ బిల్లు పార్లమెంట్ ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ లింగాల ఘనపూర్ మండల కేంద్రంలోని నెల్లుట్ల గ్రామంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎం.ఎస్.పి. మండల ఇన్చార్జి నర్సింగ రవి మాదిగ ఆధ్వర్యంలో జరుగగా ముఖ్య అతిథిగా ఎం.ఎస్.పి, ఎం.ఆర్.పి.ఎస్ జనగామ జిల్లా ఇన్చార్జి మడిపెల్లి శ్యామ్ మాదిగ మాట్లాడుతూ.... బిజెపి ప్రభుత్వం వెంటనే పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు లేకపోతే బిజెపికి తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా నాయకులు సందెన రవీందర్ మాదిగ, నల్ల లాజర్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి గండి సురేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు నరసింగ యాదగిరి మాదిగ, జీడికల్ గ్రామ శాఖ అధ్యక్షులు కొంపల్లి నాగార్జున మాదిగ, గంపల ఎల్లయ్య మాదిగ, నల్ల ఉపేందర్ మాదిగ, లంబాడి మచ్చ గిరి మాదిగ, మరి మాముల స్వామి మాదిగ, మిట్టపల్లి పరశురాములు మాదిగ, బర్లా పెద్ద మైసయ్య మాదిగ, గొంగల్లా వెంకటయ్య మాదిగ, షాగా ప్రభాకర్ మాదిగ, నర్సింగ రమేష్ మాదిగ, నల్ల సుధాకర్ మాదిగ, మిడతపల్లి నరసయ్య మాదిగ నల్ల రాజు మాదిగ, నరసింగ కిరణ్ మాదిగ, బొజ్జం లక్ష్మణ్ మాదిగ, నల్ల అబ్బ సాయిల్ మాదిగ, బర్ల కుమార్, బర్ల బిక్షపతి మాదిగ, ఎర్ర లక్ష్మయ్య మాదిగ, పల్నాటి కుమార్ మాదిగ, చెరుపెల్లి నరేష్ మాదిగ, నల్ల రాజు మాదిగ, నల్ల రాజు మాదిగ, నల్ల రమేష్ మాదిగ, నర్సింగ శ్రీధర్ మాదిగ, నరసింగ నారాయణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



## కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలని పార్లమెంట్‌లో కొట్లాడుతా : ఆర్. కృష్ణయ్య

### రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని జేరిపోతుల పరశురామ్ డిమాండ్



**జనగామ సెప్టెంబర్ 20 (ప్రజామంటలు):** భారత రాజ్యాంగ నిర్మాత రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఫోటోలు కరెన్సీ నోట్లపై ముద్రించాలని న్యూఢిల్లీ జంతర్ లో కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ ఆధ్వర్యంలో ఢిల్లిలో మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ 1921 లో ఇంపీరియల్ బ్యాంకు కుప్పకూలి నప్పుడు 'రూపాయి ఇచ్చిన సమస్య పరిష్కార మార్గం' అనే పుస్తకాన్ని రాసి హిల్టాని యంగ్ కమిషన్, రాయల్ కమిషన్, సైమన్ కమిషన్, బ్రిటిష్ ప్రభుత్వానికి ఇవ్వగా 1935 ఏప్రిల్ ఒకటిన ఆర్.బి.ఐ ఏర్పడ్డది అంటే దానికి పునాది డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నాడు అంబేద్కర్ లేకుంటే నేడు ఆర్బిఐ లేదు అలాంటి మహనీయుని ఫోటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని తన తోటి రాజ్యసభ, పార్లమెంటు సభ్యులను కలుపుకొని పార్లమెంట్‌లో కొట్లాడి సాధిస్తానని లేదంటే ప్రజా ప్రతిఘటన తప్పదని కేంద్ర ప్రభుత్వాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ను హెచ్చరించారు. కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ మాట్లాడుతూ కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలని గత ఐదు సంవత్సరాల నుండి పాదయాత్ర, ప్రజా చైతన్య రథయాత్ర జ్ఞాన యుద్ధ యాత్ర, ప్రజా చైతన్య యాత్ర, సైకిల్ యాత్ర నిర్వహించి ఢిల్లీలో 13 సార్లు ధర్నా నిర్వహించి కేంద్ర మంత్రులను, రాజ్యసభ పార్లమెంటు సభ్యులను, కలసి వినతి పత్రాలు ఇచ్చామన్నారు. రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలని పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జి. చెన్నయ్య, కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ నాయకులు బొల్లి స్వామి, అతవ ఉదయ భాస్కర్, కంఠ వేణు, గట్టగల్ల సంజీవ, పగిడిపల్లి సుధాకర్, పిడుగు ఆశీర్వాదం, కదారి శీను, చిత్రం కృష్ణ పాల్గొన్నారు.

## వెల్దండ డ్యాం గేట్లను ఎత్తించిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి



**తరిగొప్పుల సెప్టెంబరు 20 (ప్రజామంటలు):** మండలం లోని అక్కరాజుల్లి, పోతారం, మరియు నర్మెట్ట మండలం లోని అమ్మాపురం గ్రామాలకు చెందిన రైతుల భాధను అర్థం చేసుకుని సాగునీరు కోసం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి స్పందించి ఇరిగేషన్ డిఈ తో ఫోన్ లో మాట్లాడి వెల్దండ డ్యాం గేట్లను ఎత్తించారు. ఈ కార్యక్రమంలో మండల బిఆరెస్ కో ఆర్డినేటర్ జొన్నగోని కిష్టయ్య మండల బిఆరెస్ యూత్ అధ్యక్షుడు మల్యాల సుధీర్, మూడు గ్రామాల రైతులు, కల్వల తిరుపతి రెడ్డి, సుంకు రమేష్, ఎల్సాని శ్రీధర్, సుంకు సురేష్, గాలి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రికి పాలాభిషేకం చేసిన మహిళలు, బీజేపీ నాయకులు




**నర్మెట్ట సెప్టెంబరు 20 (ప్రజామంటలు):** మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షుడు ధరావత్ రాజు నాయక్ ఆధ్వర్యంలో ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి మహిళా మూర్తులు పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు బెజాడి బీరప్ప హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.... ఎన్నో సంవత్సరాలుగా అమలు గాని మహిళా రిజర్వేషన్ బిల్లు భారతీయ జనతా పార్టీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మహిళలకు 33% రిజర్వేషన్ బిల్లు కల్పిస్తూ మహిళలకు పెద్దపీట వేసినందుకు మహిళలందరూ మోడీకి రుణపడి ఉంటారని అన్నారు. ఇది చరిత్రలో స్థిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. మహిళలందరూ గ్రామ గ్రామాన పాలాభిషేకం చేసి కృతజ్ఞతా భావం తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళలు మరియు బీజేపీ జిల్లా కార్యదర్శి సోక్కం అనిల్ కుమార్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ నవీన్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆఫ్జల్ ,సీనియర్ నాయకులు కొన్నే రాజు, భూత్ అధ్యక్షులు చెవుల రాజు, మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి కార్యకర్తలకు పది లక్షల ప్రమాదం బీమా చేయించిన 'నెల్లుట్ల ప్రీతం'



**తరిగోప్పుల సెప్టెంబరు 20 (ప్రజామంటలు):** మండల కేంద్రము బిజెపి మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ అధ్వర్యంలో నరేంద్రమోడీ జన్మదిన సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు నెల్లుట్ల ప్రీతం బిజెపి కార్యకర్తలకు పది లక్షల ప్రమాదం బీమా ను కార్యకర్తలకు చేయించారు. ఈ కార్యక్రమంలో బిజెవైమ్ జనగామ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ ముద్దిరాజ్ మాట్లాడుతూ.... భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు పునాదిరాయి లాంటి వారు, అనునిత్యం పార్టీ కార్యమలను విజయవంతం చేయడంలో వారి పాత్ర చాలా గొప్పది కావున వారికి వారి కుటుంబానికి ఆర్థిక భరోసా గా ప్రమద బీమా చేయించడం జరిగింది మండల బిజెపి శాఖ తరుపున నేల్లుట్ల ప్రితం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజెయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏడేల్లి రాం నర్సింహారెడ్డి, రాం బ్రహ్మచారి, తలకోక్కుల శ్రీనివాస్, రాజు, వీరకుమార్, రాజునాయక్, ప్రవిన్ నాయక్, వెంకటేష్, ఎల్లయ్య, రమేష్, నాయకులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యపై స్పందించిన ఎమ్మెల్సీ కడియం



**చిల్పూర్ సెప్టెంబరు 20 (ప్రజామంటలు):** మండలములోని మల్కాపూర్ ఇండియన్ బ్యాంక్ పరిధిలోని 7 గ్రామాల రైతులకు తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుణమాఫీ కార్యక్రమం ద్వారా మంజూరు అయిన డబ్బులు రైతులకు ఇవ్వకపోవడంతో నిన్నటి రోజున రైతులు బ్యాంకుకి వెళ్లి డబ్బులు ఇవ్వకపోవడానికి గల కారణం ఏమిటో చెప్పాలని బ్యాంక్ మేనేజర్ ని అడగగా నిర్లక్ష్య సమాధానం చెప్పడంతో శ్రీపతిపల్లి గ్రామం నుండి రైతులు ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని హన్మకొండలోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి సమస్యను వివరించగా కడియం మట్లాడుతూ.... ఇది రైతు సంక్షేమ ప్రభుత్వము తప్పకుండా అర్హులైన ప్రతీ రైతుకి రుణమాఫీ డబ్బులు వస్తాయి. మండలంలోని ఇండియన్ బ్యాంక్ పరిధిలోని 7 గ్రామాల రైతులు ఎవరు కూడా అధైర్య పడవద్దు. కలెక్టర్ తో మాట్లాడి త్వరలోనే మీ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చినారు. ఈ కార్యక్రమంలో శ్రీపతిపల్లి గ్రామ మాజి సర్పంచ్ కొయ్యడ రామదాసు గౌడ్, నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ రంగు రమేష్ గౌడ్, సీనియర్ నాయకులు ఉడుత వెంకటనారాయణ, గొంగిడి కృష్ణమూర్తి, కేశిరెడ్డి కర్ణాకర్ రెడ్డి, మాలోతు రాజు, పల్లపు ఐలయ్య, పల్లపు శ్రీనివాస్, కొయ్యడ శ్రీనివాస్, కోల ప్రదీప్, మోతె ఉపేందర్, చెట్టబోయిన కనుకరాజు, టేకులపల్లి కొమురయ్య, బైరి సత్తయ్య, పల్లపు తిరుపతి, బొల్లు బిక్షపతి, బత్తిని సాంబరాజు, చెట్టబోయిన నాగరాజు, రొడ్డ యాదగిరి, పల్లపు కనుకరాజు, చెట్టబోయిన శంకర్, గౌలికర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ మెడికల్ కాలేజీలో యాంటీ ర్యాగింగ్ కమిటీ ఏర్పాటు



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 20 ( ప్రజామంటలు) :** ఢిల్లీ లోని నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు సికింద్రాబాద్ లోని గాంధీ మెడికల్ కాలేజీలో యాంటీ ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్ గా కళాశాల ప్రిన్సిపాల్, డీఎంఈ డాక్టర్ కె.రమేష్ రెడ్డి,సభ్యులుగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణ మోహన్, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు, వివిధ విభాగాల హెచ్.వో.డీ లు, విద్యార్థుల తల్లిదండ్రులు, హాస్టల్ వార్డెన్ లతో పాటు స్థానిక జర్నలిస్ట్ ల తరఫున ప్రతినిధిగా సీనియర్ జర్నలిస్ట్ కొండ్రేటి శ్రీనివాస్ ను నియమించారు. ఈ కమిటీ ఏడాది పాటు పని చేస్తుందని, గాంధీ వైద్య కళాశాలలో ర్యాగింగ్ నిరోధించడానికి సలహాలు, సూచనలు, చర్యలు తీసుకుంటుందని అధికారులు తెలిపారు.

# అభివృద్ధి చేసే అవకాశం ఇవ్వండి

### ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి



**హుజురాబాద్ సెప్టెంబర్ 20 (ప్రజా మంటలు) :** నాయకుల నిర్లక్ష్యం మూలంగా హుజురాబాద్ నియోజకవర్గం అనుకున్నంత అభివృద్ధి జరగలేదని రాబోయే ఎన్నికల్లో తనకు ఎమ్మెల్యేగా ఛాన్స్ ఇచ్చి అభివృద్ధి చేసే అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. బుధవారం హుజరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ కన్వెన్షన్ హాల్ లో ఎల్ఐసి ఏజెంట్ల తో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట ఇస్తే ఎంత కష్టమైనా పనిచేసి చూపిస్తానని అన్నారు హుజురాబాద్ నియోజకవర్గాన్ని సిద్దిపేట లాగ చేయకపోతే వచ్చే ఎన్నికల్లో ఓటు అడగనని అన్నారు. నా దమ్ము ధైర్యం సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. హుజురాబాద్‌లో మినీ స్టేడియం గ్రౌండ్ నిర్మాణం చేపడుతున్న ట్లు చెప్పారు. నాకు నటించడం రాదని, ఏదైనా సూటిగా మాట్లాడే వ్యక్తిని అని అన్నారు. ఒక అవకాశం ఇస్తే ఐదేళ్లలో హుజరాబాద్ ప్రాంతాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఎల్ఐసి ఏజెంట్లకు కేసి క్యాంపులో కేటాయించిన భూమి ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు.

### హుజరాబాద్ లో మినీ కలెక్టరేట్ నిర్మాణం...

హుజరాబాద్ పట్టణ నడిబొడ్డున మినీ కలెక్టరేట్ నిర్మాణం చేసి పరిపాలనను ప్రజలకు సౌలభ్యంగా మారుస్తానని అన్నారు. పట్టణంలోని హనుమాన్ టెంపుల్ వద్ద కళ్యాణ మండపం, కార్పొరేట్ స్థాయిలో బాలికల ఉన్నత పాఠశాల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, హుజురాబాద్ చుట్టూ ఔటర్ రింగ్ రోడ్, చిలుక వాగుపై బ్రిడ్జి తో పాటు కరీంనగర్ తరహాలో అద్భుతమైన ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నిర్మాణం చేపడతానని హామీ ఇచ్చారు. అంతే కాకుండా జమ్మికుంట నాయని చెరువు, హుజురాబాద్ మోడల్ చెరువును అద్భుతంగా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతానన్నారు. జమ్మికుంట ను బిజినెస్ సెంటర్ గా మారుస్తానని, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తానన్నారు. జమ్మికుంటలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. వీణవంకలో మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాల నిర్మాణాన్ని అన్ని హంగులతో చేపడతానన్నారు. చల్లూరు, వావిలాల, ఉప్పల్ గ్రామాలను మండలాలుగా మారుస్తాన న్నారు. ఇల్లంతకుంటను టెంపుల్ సిటీగా మార్చి మినీ యాదగిరి గుట్టలాగా తీర్చిదిద్దుతానన్నారు. కమలాపూర్ మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా మార్చేందుకు కృషి చేస్తానని అన్నారు.

### కౌశిక్ రెడ్డికి మద్దతిస్తూ ఎల్ఐసి ఏజెంట్ల తీర్మానం

రాబోయే ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాడి కౌశిక్ రెడ్డికే మా సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎల్ఐసి ఏజెంట్లు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తీర్మానం కాపీని ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డికి అందజేశారు. కౌశిక్ రెడ్డి గెలుపు కోసం హుజురాబాద్ నియోజకవర్గం లోని ఏజెంట్లు అందరూ కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కౌశిక్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించు కొని హుజురాబాద్ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటామని సందర్భంగా ఏజెంట్లు స్పష్టం చేశారు.

### స్థానిక సమస్యలు పట్టించుకోని ఎమ్మెల్యే..

హుజురాబాద్ ఎమ్మెల్యే గా ఉన్న వ్యక్తి స్థానిక సమస్యలను హుజురాబాద్ అభివృద్ధిని పట్టించుకోలేదని ప్రభుత్వ విప్ కౌశిక్ రెడ్డి ఆరోపించారు. గతంలో మంత్రిగా ఉన్న వ్యక్తి నిర్లక్ష్యం మూలంగానే హుజురాబాద్ ప్రాంతం వెనుకబడిందని విమర్శించారు. ఆయనకు శాసనసభ్యునిగా, మంత్రిగా అవకాశం ఇచ్చిన ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం పనిచేయలేదన్నారు. తన స్వార్థం కోసం మాత్రమే ఆలోచించే వ్యక్తి ఇక్కడి ఎమ్మెల్యే అని అన్నారు. అనంతరం హుజురాబాద్ పట్టణం నుండి కేసు క్యాంపు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎల్ఐసి ఏజెంట్ల భవనానికి కేటాయించిన స్థలంలో భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక-శ్రీనివాస్, ఎంపీపీ ఇరుమల్ల రాణి, వైస్ చైర్మన్ కొలిపాక నిర్మల-శ్రీనివాస్, లియాఫీ అధ్యక్షులు పంజాల ప్రభాకర్ కార్యదర్శి నరసింహారెడ్డి, ఏజెంట్లు కె బాపూరావు, శ్రీనివాస్, ఎర్రం పాపిరెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## గీతా కార్మికులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

### రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్



**హుజురాబాద్ సెప్టెంబర్ 20 (ప్రజా మంటలు) :** కుల వృత్తులు పటిష్టంగా ఉంటే గ్రామాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని భావించి సీఎం కేసీఆర్ గ్రామాల్లో కష్టపడే గీతా కార్మికులకు అండగా ఉన్నారని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. బుధవారం హుజురాబాద్ మండలం జూపాక గ్రామంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ సొంత ఖర్చుతో తీసుకొని వచ్చిన తాటి, ఈత మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన, ఆరోగ్యమైన నీరాతో పాటు కులవృత్తులను కాపాడాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తాటి, ఈత చెట్లను నాటిస్తుందని అన్నారు. కులవృత్తులతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా తాటి, ఈత, డైమండ్ చెట్లను నాటుతున్నామని తెలిపారు. జూపాక గ్రామంలోని తాటి వనంలో రెండువేల మొక్కలను నాటడం జరుగుతుందని వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత గౌడ కులస్తులపై ఉందన్నారు. గౌడ కులస్తుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ ప్రమాదవశాత్తు తాడిచెట్టు పైనుండి పడి మృతి చెందిన పూర్తిస్థాయిలో అంగవైకల్యం గురైన బాధితులకు ప్రభుత్వం ద్వారా ఐదు లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించి ఆదుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కొండూరు సత్యనారాయణ గౌడ్, మాజీ ఎంపిటిసి కేతిరి రాజిరెడ్డి, టిఆర్ఎస్ నాయకులు ఇరుమల్ల సురేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భార్య స్థానంలో భర్త చెలామణి

### సర్పంచ్ భర్త పై చట్టపరమైన చర్యలు తీసుకోండి

### జిల్లా కలెక్టర్ కు పిర్యాదు





**బుగ్గారం / జగిత్యాల జిల్లా:** జగిత్యాల జిల్లా బుగ్గారం గ్రామ సర్పంచ్ "మూల సుమలత" స్థానంలో ఆమె భర్త "మూల శ్రీనివాస్ గౌడ్" చెలామణి అవుతున్నారని ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకొని శిక్షించాలని బుధవారం జిల్లా కలెక్టర్ కు ప్రముఖ ఉద్యమకారుడు చుక్క గంగారెడ్డి పిర్యాదు చేశారు. ఈ సంధ్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16 శనివారం మండల పరిషత్ కార్యలయంలో జరిగిన బుగ్గారం మండల సర్వసభ్య సమావేశంలో ప్రత్యక్షంగా "మూల శ్రీనివాస్ గౌడ్" పాల్గొని ముందు వరుసలోనే కూర్చున్నారని తెలిపారు. ఫోటో, దినపత్రిక లో ప్రచురింపబడిన వార్తాకథనంతో సహా ఆయన జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేశానని అన్నారు. అలాగే ఈనెల 15 శుక్రవారం ఉదయం బుగ్గారం గ్రామ పంచాయతీలో నిర్వహించిన బ్యాంక్ ఖాతాదారుల, సైబర్ క్రైమ్ నేరాల అవగాహన సదస్సులో కూడా సర్పంచ్ స్థానంలో ఆయననే హాజరై, సభా వేదికపై ఆసీనుడై, సర్పంచ్ స్థానంలో ఆమెకు బదులు అతడు మైకు పట్టి మాట్లాడారని ఆరోపించారు. ఇందుకు సంబంధంచిన ఫోటోలు, వీడియో లు కూడా ఉన్నాయని తెలిపారు. ఇలా అనేక కార్యక్రమాలలో మూల శ్రీనివాస్ గౌడ్ సర్పంచ్ స్థానంలో పాల్గొనడమే కాకుండా చట్టవ్యతిరేకమైన పంచాయతీలు, పైరవీలు నిర్వహిస్తున్నాడని అన్నారు. అనేక మంది గ్రామ ప్రజల వద్ద దడువత్ రూపకంలో డబ్బులు కూడా పెట్టుకొని పంచాయతీలు, సెటిల్ మెంట్లు చేస్తున్నాడని ఆయన ఆరోపించారు. అధికారుల పేరుతో, సిబ్బంది పేరుతో అవినీతి, అక్రమాలకు కూడా పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అనేక కార్యాలయాలలో, అనేక చోట్ల నేనే సర్పంచ్ ని అంటూ గొప్పలు చెప్పుకుంటూ ఆయా పరిస్థితులను, సందర్భాలను తనకు అనుకూలంగా మలుచుకుని అనేక రకాలుగా లబ్ది పొందుతున్నారని వివరించారు. బుగ్గారం గ్రామ పంచాయతీలో కూడా మూల శ్రీనివాస్ గౌడ్ అనే వ్యక్తి పాత్రధారి, సూత్ర దారిగా వ్యవహరించి భారీ నిధుల దుర్వినియోగం నకు పాల్పడ్డారని ఆయన అన్నారు. వెంటనే ఇతనిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కటినంగా శిక్షిస్తూ ఇలాంటి సంఘటనలు ఎక్కడా కూడా పునరావృతం కాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ను చుక్క గంగారెడ్డి కోరారు.

# తెలంగాణ తెచ్చుకుంది ఇందుకేనా..?

### అత్యవసర విభాగంపై ఇంత నిర్లక్ష్యమా..?

### ఏండ్ల తరబడిగా యూజీసీ ఎరియర్స్ పెండింగ్ పై డాక్టర్ల ఆగ్రహం

### గాంధీ లో 3 గంటల పాటు డ్యూటీల బాయ్కాట్




**సికింద్రాబాద్, సెప్టెంబర్ 20 ( ప్రజామంటలు) :** న్యాయబద్దంగా రావాల్సిన తమ యూజీసీ ఎరియర్స్, టీఏ, ఈఎల్ ఎన్ క్యాష్మెంట్, ప్రొఫెసర్ల సీఏఎస్, సిబ్బంది స్టైంతెన్ పై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం చేస్తుందని ప్రభుత్వ డాక్టర్లు ఆగ్రహించారు. బుధవారం తెలంగాణ ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్ (టీజీజీడీఏ) నేత డా.భూపేందర్ రాథోడ్ అధ్వర్యంలో విధులను బహిష్కరించిన వైద్యులు ఈసందర్భంగా గాంధీ మెయిన్ బిల్డింగ్ వద్ద వైద్య గర్జన పేర ధర్నా నిర్వహించారు. పలువురు టీజీజీడీఏ నాయకులు మాట్లాడుతూ..తెలంగాణ వస్తే ప్రభుత్వ డాక్టర్లకు ఎంతో మేలు చేస్తాడుకుంటే సీఎం కేసీఆర్ తమను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయారు. తమకు నయాపైసా ఎక్స్ట్రా వద్దని, తమకు న్యాయబద్దంగా రావాల్సిన తమ యూజీసీ ఎరియర్స్ ఇస్తే చాలన్నారు. తమ జీతాలు సరిపోక, అప్పులు పెరిగాయని, జీతాలు ఈఎంఐ లు కట్టడానికే సరిపోతుందని, పైన పటారం...లోన లొటారం...లాగా తమ దుస్థితి ఉ ందన్నారు. తెలంగాణ వస్తే ఏదో అద్భుతం జరుగుతుందనుకుంటే కేవలం జూమ్ మీటింగ్, బయోమెట్రిక్ మాత్రమే వచ్చాయన్నారు. హెల్త్ మినిస్టర్ హరీశ్రావు, ఉన్నతాధికారులు రెగ్యులర్ గా జూమ్ మీటింగ్ ల్లో హెల్త్ సెక్టార్ లో దేశంలో తెలంగాణ 3వప్లేస్ వచ్చిందని గొప్పలు చెప్పుకుంటారని,కాని 3 వప్లేస్ రావాడానికి తాము పడుతున్న కష్టాన్ని మాత్రం గుర్తించడం లేదన్నారు. అసలు ప్రభుత్వానికి పేద రోగులన్నా..డాక్టర్లన్నా..చులకనతనం అని అన్నారు. రాష్ట్రంలో ఎన్నో లక్షల కోట్లను వివిధ పథకాలకు ఖర్చుపెడుతున్న కేసీఆర్ సర్కార్ తమకు జనవరి 2016 నుంచి సెప్టెంబర్ 2020 వరకు రావాల్సిన యూజీసీ ఎరియర్స్ డబ్బులు ఇవ్వడానికి చేతులు రావడం లేదన్నారు. ఇప్పటికైన వెంటనే ప్రభుత్వ డాక్టర్లకు రావాల్సిన జీతాలు, ఎరియర్స్, టీఏ అలవెన్సు ఇవ్వకపోతే త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లంతా నిరవధికంగా సమ్మె చేస్తామని హెచ్చరించారు. డాక్టర్ల ఆందోళనకు గాంధీ ఆసుపత్రి నర్సులు సంఘీబావం తెలిపారు. కార్యక్రమంలో టీజీజీడీఏ ఉద్యమ నాయకులు డాక్టర్ భూపేందర్ రాథోడ్, డాక్టర్ రమేశ్, డా.ప్రవీణ్,డా. శోభన్ బాబు, డా.నర్సింహారావు నేత, డా.లాలూ ప్రసాద్, డా.నరహరి, డా.సుభోద్, డా.వినోద్, డా.రంగా, డా.రవి, డా.అబ్బయ్యా, డా.జానకి, డా.శేఖర్ లతో పాటు వందలాది మంది డాక్టర్లు పాల్గొన్నారు. గాంధీలో డాక్టర్లు 3 గంటల పాటు డ్యూటీలు బహిష్కరించడంతో పీజీ వైద్యులు, ఇతర డాక్టర్లు అత్యవసర వైద్య విధులను నిర్వర్తించారు.

## మహ్మద్ షమీకి బెయిల్ మంజూరు!

స్వదేశంలో త్వరలో ఆరంభం కానున్న ఐసీసీ వన్డే ప్రపంచకప్ 2023కు ముందు భారత సీనియర్ పేసర్ మహ్మద్ షమీకి ఊరట లభించింది. షమీ భార్య హసిన్ జహాన్ పెట్టిన గృహ హింస కేసులో అలీపూర్ కోర్టు అతడికి రెండు వేల రూపాయల పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేసింది. షమీ మంగళవారం కోల్‌కతాలోని అలీపూర్ ఏసీజేఎం కోర్టుకు భౌతికంగా హాజరై బెయిల్ తీసుకున్నాడు. షమీతో పాటు అతని సోదరుడు మహ్మద్ హసీమ్‌కు కూడా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. 2018లో జాదవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో మహ్మద్ షమీతో పాటు అతడి సోదరుడు మహ్మద్ హసీమ్‌పై హసిన్ జహాన్ ఫిర్యాదు చేసింది. షమీ, అతడి కుటుంబ సభ్యులు తనను వేధిస్తున్నారని.. షమీ వివాహేతర సంబంధం కూడా కలిగి ఉన్నాడని జహాన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. జహాన్ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా.. షమీ మరియు అతని కుటుంబ సభ్యులలో కొందరిపై కేసు నమోదైంది. ఇక 2019 ఆగస్టు 29న అలీపూర్ అడిషినల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ షమీపై అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. ఇక సెప్టెంబర్ 9న కోల్‌కతా కోర్టు ఆ అరెస్ట్ వారెంట్‌పై స్టే విధించింది. 2023 జనవరిలో హసిన్ జహాన్‌కు నెలవారీ పరిహారంగా రూ. 50 వేలు చెల్లించాలని భారత పేసర్ మొహ్మద్ షమీని అలీపూర్ కోర్టు ఆదేశించింది. ఇక షమీపై ఉన్న స్టేను ఎత్తివేయాలని జహాన్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. హసిన్ ఫిర్యాదును దృష్టిలో ఉంచుకుని ఆగస్టు 23న అలీపూర్ అదనపు సెషన్స్ జడ్జి షమీకి సమన్లు? జారీ చేయడం వెనుక సరైన కారణం కనిపించలేదని ఆదేశించారు. ఈ కేసులో సెప్టెంబర్ 19న కోర్టుకు హాజరై బెయిల్ కోసం షమీ దరఖాస్తు చేసుకోగా.. న్యాయమూర్తి పిటిషన్‌ను మన్నించి బెయిల్ మంజూరు చేశారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092, PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com